

## గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు శ్రీకారం

- రాజమహేంద్రవరంలో ఫేజ్ వన్ కింద రూ.9.55 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

మిగతా 3

మనసులో మాట
KANCHARLA
సంచలన తెలుగు దిన పత్రిక
కోస్తాంధ్ర
తూర్పు గోదావరి | పశ్చిమ గోదావరి | కృష్ణా
గుంటూరు | ప్రకాశం | నెల్లూరు
సోమవారం 13 ఏప్రిల్ 2026 పేజీలు : 16

# మనసులో మాట అద్భుతం

## -పత్రికను ఆవిష్కరించిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

**కొత్తపేట (మనసులో మాట), ఏప్రిల్ 13:** 'మనసులో మాట' పత్రిక అద్భుతంగా ఉందని, దినదినాభివృద్ధి చెందాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవారి ఆలయంలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు వచ్చిన మంత్రి ఆనం 'మనసులో మాట' దినపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పత్రికను ఆద్యంతం పరిశీలించారు. మంచి సమాచారం ఉందని మెచ్చుకున్నారు. పత్రిక ఆకర్షణీయంగా ఉందని, చూసేందుకు, చదివేందుకు పత్రికలో సమగ్ర సమాచారం ఉందన్నారు. అనంతరం మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్, ఆర్జేసీ త్రినాధరావు, కొత్తపేట మనసులో మాట నియోజకవర్గ రిపోర్టర్ రాజు తదితరులతో కలిసి 'మనసులో మాట' పత్రికను ఆవిష్కరించారు.





### పేద విద్యార్థుల విద్యోన్నతికి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు అభినందనీయం

-మంత్రి కందుల దుర్గేష్

- మిగతా వార్త 2లో



### సోమవారం యధావిధిగా పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్

- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



### మంత్రి ఆనంను సత్కరించిన మంత్రి కందుల

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** తూర్పు గోదావరి జిల్లాలో పర్యటన నిమిత్తం ఆదివారం రాజమహేంద్రవరం వచ్చిన దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మంత్రి కందుల దుర్గేష్ ఆప్యాయంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి ఆనంను పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ సత్కరించారు.

### కాకినాడ పార్లమెంటు పరిధి ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు సమావేశం

## పలు సమస్యలను సీఎం దృష్టికి..



మిగతా 2



## చిరస్మరణీయుడు.. నార్ని కేదారేశ్వరుడు

### 'రాకా' సంస్థ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తూ మంత్రి దుర్గేష్ కితాబు ..

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12 :** కళా సాంస్కృతిక రంగాల పోషకునిగా, దాతగా రాజమహేంద్రవర చరిత్రలో నార్ని కేదారేశ్వరుడు చిరస్మరణీయుడని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. అభినవ కృష్ణరాయ, ఆంధ్రభోజ నాట్యాచార్య కేదారేశ్వరుడు గురించి ప్రముఖుల అభిప్రాయాలను సేకరించి రాకా సాంస్కృతిక సంస్థ రూపొందించిన ప్రత్యేక సంచికను మంత్రి దుర్గేష్ ఆదివారం ఉదయం స్థానిక శ్రీవెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలోని నార్ని కేదారేశ్వరుడు కళావేదికపై ఆవిష్కరిం చారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ డీ మునిరత్నం నాయుడు, మాజీ ఎమ్మెల్యే సూర్యప్రకాశరావు, తదితరుల సమక్షంలో - మిగతా వార్త 2లో

# దేవదాయ శాఖ చలివేంద్రాలు

### - బాటసారుల దాహార్తి తీర్చేందుకే చలి వేంద్రాలు - ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాజమహేంద్రవరం నగరంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రారంభించారు. స్థానిక కోటిలింగాల పేటలో శ్రీ పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ప్రారంభించి వేద విద్యార్థులు, బాటసారులు, భక్తులకు చల్లని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్రం కమిటీ చైర్మన్ రెడ్డి మణేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పెన్మెత్స విశ్వనాధరాజు, కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. వేద పాఠశాల విద్యార్థులు - మిగతా వార్త 2లో

మనసులో మాట



# పరామర్శ

**తణుకు, (మనసులో మాట) ఏప్రిల్ 12:** ఇటీవల గుండె సంబంధిత చికిత్స పొందిన డాక్టర్ దొమ్మేటి సుధాకర్ ని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడిపూడి సత్తిబాబు కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో డాక్టర్ సుధాకర్ గారు పార్టీ బలోపేతానికి చేసిన సేవలను గుర్తు చేశారు. తణుకు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, స్టేట్ ఆప్కో మాజీ చైర్మన్‌గా ప్రజాసేవలో విశేష కృషి చేసిన ఆయన ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా పార్టీకి సేవలు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శెట్టిబలిజ నాయకులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

### కాకినాడ పార్లమెంటు పరిధి ఎమ్మెల్యేలతో

## సీఎం చంద్రబాబు సమావేశం

**- హాజరైన తుని ఎమ్మెల్యే యనమల దివ్య**

**- పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే**

**తుని (మనసులో మాట) ఏప్రియల్ 12.** ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కాకినాడ పార్లమెంటు పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశమైయ్యారు. ఈసమావేశానికి హాజరైన ప్రభుత్వ విఫ్ యనమల దివ్య తాను ప్రాతినిధ్యం వహిస్తున్న తుని నియోజకవర్గ భవిష్యత్ అభివృద్ధి ప్రణాళికలను ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్ళారు. ముఖ్యంగా మహిళా నర్సింగ్ కాలేజ్ కి అనుమతులు కోరిన ఆమె తుని పట్టణాభివృద్ధి కోసం రూపొందించిన అభివృద్ధి ప్రతిపాదనలకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అలాగే జాతీయ రహదారిని అనుసంధానం చేసే గ్రామీణ రహదారులకు నిధులు మంజూరు చేయాలని యనమల దివ్య కోరారు. సమావేశంలో మంత్రులు పి. నారాయణ, వాసంశెట్టి సుభాష్, ఎంపీ తంగెళ్ళ ఉదయ శ్రీనివాస్ ఇతర నియోజకవర్గాల శాసన సభ్యులు పాల్గొన్నారు.

## దేవదాయ శాఖ చలివేంద్రాలు

- మొదటి పేజీ తరువాయి ఎమ్మెల్యేకు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం స్థానిక శ్రీ ఉమా కోటిలింగేశ్వర స్వామి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన మరో చలివేంద్రాన్ని కూడా ఎమ్మెల్యే ప్రారంభించారు. దేవస్థానం పాలకమండలి చైర్మన్ కొయ్యల రమణ, కార్యనిర్వహణాధికారి ఆర్. లక్ష్మీ భాయి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూడమండు వేసవిలో భక్తులు, యాత్రీకులు, బాటసారులకు ఉపశమనం కలిగించేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. గోదావరి తీరం వద్ద పలు కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ఈ సేవలు విశేషంగా ఉపయోగపడతాయని అన్నారు. దాతల సహకారంతో ప్రతి రోజూ మజ్జిగ పంపిణీ చేసి వేసవి ముగిసే వరకు చలివేంద్రాలు నిరంతరంగా పనిచేసేలా అధికారులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించాలని సూచించారు. దేవాలయ కమిటీలు సమన్వయంతో ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే వాసు కొనియాడారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, డైరెక్టర్లు, అర్చకులు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల విద్యోన్నతికి స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు అభినందనీయం

**- ప్రభుత్వ కళాశాలలకు చెందిన 286 మంది మెరిట్ విద్యార్థులకు రూ. 22.56 లక్షల ఆర్థిక సాయాన్ని అందించిన మలబార్ గోల్డ్ ఛారిటబుల్ సంస్థ..**

**- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వాల తోడ్పాటుతో పాటు సామాజిక సంస్థల ఆర్థిక చేయూత అవసరమన్న మంత్రి దుర్గేష్**




**రాజమహేంద్రవరం (మనసులో మాట) ఏప్రిల్ 12:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థలో తెస్తున్న సంస్కరణలకు తోడుగా స్వచ్ఛంద సంస్థలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఇతోధికంగా సాయం చేయడం గొప్ప విషయమని, ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం నవభారత నిర్మాణానికి దోహదపడుతా యని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం రాజమండ్రి కరెంట్ ఆఫీస్ సమీపంలో త్యాగరాజు నారాయణదాసు సేవా సమితిలో మలబార్ గోల్డ్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మలబార్ గోల్డ్ సంస్థ ఆధ్వర్యంలో రాజమండ్రి, కొవ్వూరు, నిడదవోలు ప్రభుత్వ కళాశాలలకు చెందిన దాదాపు 286 మంది మెరిట్ విద్యార్థినులకు రూ. 22.56 లక్షల సీఎస్ఆర్ స్కాలర్ షిప్ లు అందించడం ప్రశంసనీయమన్నారు. లాభాల్లో 5 శాతం సామాజిక సేవకు కేటాయించడం, ముఖ్యంగా ఆడపిల్లల విద్యకు ప్రాధాన్యతనివ్వడం మలబార్ గోల్డ్ సంస్థ ఉన్నత సంస్కారానికి నిదర్శనమని కొనియాడారు. భ్రూణ హత్యలు, లింగ వివక్ష లేని నవ సమాజం వైపు అడుగులు వేయాలని, కౌమార దశ నుంచే బాలికలకు సాధికారతపై అవగాహన కల్పించాలని పిలుపు నిచ్చారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల భవిష్యత్తుకు కీలకమైన దశ అని మంత్రి అన్నారు. చదువుతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకో వాలని, త్వరలో మలబార్ గోల్డ్ సంస్థ ఏర్పాటు చేసే 'మైక్రో లెర్నింగ్ సెంటర్స్'ను వినియోగించుకోవాలని సూచించారు. విద్యా సంస్కరణల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహానికి తోడు, కార్పొరేట్ సంస్థలు తమ సీఎస్ఆర్ నిధులతో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం నవభారత నిర్మాణానికి దోహదపడుతుందన్నారు. ఆడపిల్లల చదువు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయన్నారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో వచ్చిన సంస్కరణలతో విద్యకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ ఒక్క ప్రతిభావంతుడైన విద్యార్థి చదువు ఆగకూడదన్నదే తమ ఆకాంక్ష అని చెబుతూ విద్యార్థులందరికీ మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

# చిరస్మరణీయుడు.. నార్ని కేదారేశ్వరుడు




- మొదటి పేజీ తరువాయి
పుస్తకావిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ కళా కేంద్రంలోని వేదిక నిర్మాణం కోసం ఆరోజుల్లో రూ. 25,116 అందించిన కేదారేశ్వరుడు ఔదార్యాన్ని ఎవరూ మరిచిపోలేరని అన్నారు. అలాగే విజయ శంకర సంగీత నృత్య పాఠశాల నెలకొల్పి ప్రభుత్వ పరం చేసి రూ. 25 వేలు, సంగీత పరికరాలు, సిబ్బందిని కూడా ఇచ్చారన్నారు. సంగీత పాఠశాలకు కేదారేశ్వరుడు పేరు పెట్టాలని భావించినప్పటికీ తన పేరు వద్దని చెప్పిన మహనీయుడని ఆయన కీర్తించారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ కేదారేశ్వరుడు కుటుంబ సభ్యులకు ఆస్తులు ఇవ్వకపోయినా చిర స్థాయిగా నిలిచిపోయే పేరు ఇచ్చారని అన్నారు. కేదారేశ్వరుడు కుటుంబ సభ్యులను 'రాకా' సంస్థ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, జీవీ రమణ తదితరుల సారథ్యంలో అతిథులు చేతుల మీదుగా వస్త్రాలతో సత్కరించారు. అలాగే కేదారేశ్వరుడు నిలువెత్తు చిత్ర పటాన్ని విజయశంకర ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాలలో పెట్టేందుకు మంత్రి దుర్గేష్ తదితరుల చేతులమీదుగా కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రిన్సిపల్ పసుమర్తి శ్రీనివాస శర్మకు అందజేశారు. అతిథులను కండువాలతో,జ్ఞాపికలతో నిర్వాహకులు సత్కరించారు. తెలుగు వెలుగు అరిపిరాల నారాయణరావు, సీసీసీ ఛానల్ ఎండీ పంతం కొండలరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు అల్లు బాబి, నిమ్మలపూడి గోవింద్, సంగీత నృత్య పాఠశాల పూర్వ ప్రిన్సిపాల్ కేవీ రంగనాయకమ్మ, దేశిరెడ్డి బలరామనాయుడు, రాకా సంస్థ కోశాధికారి సూరపురెడ్డి తాతారావు, సహాయ కార్యదర్శి కేఎన్ గౌరీ శంకర్, మదర్శా అలీ, భమిడిపాటి రామకృష్ణమూర్తి, పీవీఎస్ కృష్ణారావు, డాక్టర్ బిక్కిన రామమనోహర్, యర్రమోతు ధర్మరాజు, ఏరుకొండ వెంకటేష్, ఎం రమేష్ , బొబ్బిలి శ్రీనివాసరావు, తిరుమల కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు. నూజిళ్ల సూరిబాబు, అడ్డాల నాగేశ్వరరావు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. చిరంజీవి జోషిత్ శ్రీసాయి పాట, చిరంజీవి పీవీఎస్డీఎస్వీ శేష రామ శ్రీశయన్, ఫణీ స్వామి ల ఏకపాత్రాభినయం, పూజిత రెడ్డి నృత్యాభినయం, సంగీతం మాస్టారు శిష్టు మధుసూదన్ శిష్య బృందంచే అన్నమాచార్య సంకీర్తనలు, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



## పాడాలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 12: పిఠాపురం ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (పాడా )కార్యాలయంలో సోమవారం ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు పాడా పీడీ శివరాం ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ స్థాయి అధికారులు అందరూ ఈ కార్యక్రమానికి తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే అర్జీలను నేరుగా సమర్పించవచ్చని, రాలేని వారు (మీకోసం డాట్ ఏపీ డాట్ జి ఓ వి డాట్ ఇన్ )వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని ఆయన సూచించారు.

## దర్శకులు, నిర్మాతలను కలిసిన మార్నింగ్ కాఫీ క్లబ్ సభ్యులు



**భీమవరం, (మనసులో మాట) ఏప్రిల్ 12 :** సినీ దర్శకులు రేలంగి నరసింహారావు, శత చిత్రాల నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, దర్శకుల సంఘం అధ్యక్షులు వివిఎన్ ఆదిత్య లను అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి అధ్యక్షుడు భట్టిప్రోలు శ్రీనివాసరావు, మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, చంద్రబట్ల శ్రీనివాస్ కలిశారు. భీమవరం టౌన్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఆదివారం రాత్రి వారిని కలిసి ఆత్మీయంగా పలకరించారు. భీమవరం లో వారుకున్న పరిచయాలు అనుభవాలు తదితర విషయాలపై చర్చించారు. త్వరలో భీమవరం వస్తామని చెప్పినట్లు వారు తెలిపారు.

## పంచరామ క్షేత్రంలో జిల్లా ఎస్పీ ప్రత్యేక పూజలు





**సామర్లకోట (మనసులో మాట) ఏప్రిల్ 12;** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదివారం సామర్లకోట పంచరామ భీమేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయం వద్ద ఈవో బల్ల నీలకంఠం, సామర్లకోట సర్కిల్స్ ఇన్స్పెక్టర్ కృష్ణ భగవాన్ ఎస్పీ బిందు మాధవ్ కు స్వాగతం పలికారు. బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామికి ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రాంబాబు శర్మ వెంకన్న శర్మ సత్యనారాయణమూర్తి రాజగోపాల్ శర్మ తదితర పండితులు ఎస్పీ బిందు మాధవ్ కు వేద ఆశీస్సులు అందించారు. ఈ ఓ నీలకంఠం ఎస్పీ బిందు మాధవ్ ను సత్కరించి, స్వామివారి ప్రసాదాన్ని అందించారు. ట్రాఫిక్ ఎస్ఐ అడపా గరగారావు, అన్నదానం సూపర్వైజర్ శ్రీనివాసరావు, పోలీసులు ఆలయ అధికారులు పాల్గొన్నారు

# గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు శ్రీకారం

### - రాజమహేంద్రవరంలో ఫేజ్ వన్ కింద రూ.9.55 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన - మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి





**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12 :** తూర్పు గోదావరి జిల్లా గోదావరి పుష్కరాలు 2027 సందర్భంగా చేపట్టవలసిన పనులను ఈ రోజు నుంచి ప్రారంభం చేసినట్లు రాష్ట్ర దేవదాయ- ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరం నగరంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఫేజ్ 1 కింద రూ.9.55 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు ఎంపీ దగ్గుబాటి పురంధరేశ్వరి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తదితరులతో కలసి శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో వేద పండితులు, వేద పాఠశాల విద్యార్థులు పూర్ణకుంభంతో సంప్రదాయ రీతిలో మంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దేవదాయ - ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. 2027 జూన్ 26 నుంచి గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందస్తుగా పరిసర ప్రాంతాల ఆలయాల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పుష్కరాల నిర్వహణపై ఇప్పటి వరకు మూడు రాష్ట్ర స్థాయి సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. చీఫ్ సెక్రటరీ ఆధ్వర్యంలో ఒక సమావేశం, 12 మంత్రులతో సబ్ కమిటీ సమావేశం, అలాగే ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో మంత్రులు, సెక్రటరీలతో మరో సమావేశం నిర్వహించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుష్కరాల నిర్వహణలో విశేష అనుభవం కలిగిన నాయకుడని, ఆయన సారథ్యంలో ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాజమహేంద్రవరం నగరంలో రూ.9.55 కోట్ల వ్యయంతో 6 దేవదాయ సంస్థల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టడం సంతోషదాయకమని మంత్రి అన్నారు. ఆలయాల పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయడం తనకు దక్కిన అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన పనులను కూడా ప్రాధాన్యత క్రమంలో గుర్తించి అంచనాలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ జిల్లాల్లోని 43 దేవాలయాల అభివృద్ధి కోసం రూ.51.79 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు కూడా పిలిచినట్లు వెల్లడించారు. పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని, ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేశ, విదేశాల నుంచి సుమారు 10 కోట్ల మంది భక్తులు రానున్న నేపథ్యంలో మౌలిక సదుపాయాలు సమగ్రంగా కల్పించనున్నట్లు తెలిపారు. గోదావరి నది ప్రవహించే 212 కిలో మీటర్ల పరిధిలో తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కోనసీమ, ఏలూరు, కాకినాడ జిల్లాల్లో పుష్కర స్నానాలకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సహకారంతో ఈ పుష్కరాలను విజయవంతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 26 నుంచి జూలై 7 వ తేదీ గోదావరి పుష్కరాలు నిర్వహించనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. గోదావరి పుష్కరములు 2027 సందర్భంగా తూర్పు గోదావరి జిల్లాలో దేవదాయ శాఖ పరిధిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, ఫేజ్ - 1 కింద రాజమహేంద్రవరం నగరంలో 6 దేవదాయ సంస్థల నూతన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇందులో శ్రీ పందిరి మహాదేవుడు కోటిలింగాల సత్రం (పిండ ప్రదాన భవనం)కు రూ.3 కోట్లు, శ్రీ రమా సత్యనారాయణ స్వామి దేవస్థానం ముఖ మండపం నిర్మాణానికి రూ.1 కోటి, శ్రీ రాజమండ్రి నూనె వర్తకుల అన్నదాన సమాజం అన్నదాన భవనానికి రూ.70 లక్షలు, శ్రీ రామలింగ చౌడేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి రూ.55 లక్షలు, శ్రీ గౌతమీ జీవకారుణ్య సంఘం భవనం నిర్మాణానికి రూ.2.8 కోట్లు, శ్రీ చందా సత్రం కల్యాణ మండపం మొదటి అంతస్తు నిర్మాణానికి రూ.1.50 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. ఈ పనులు పూర్తయిన తరువాత భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించబడటంతో పాటు పుష్కరాల సమయంలో యాత్రికులకు మరింత సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి జిల్లా దేవాలయాల అభివృద్ధి పనులు చేపట్టినందుకు అభినందనలు తెలిపారు. అనంతరం దుశ్శాలువాతో సన్మానించారు. దేవదాయ, పర్యటక శాఖల సమన్వయంతో టెంపుల్ టూరిజం అభివృద్ధి దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ పుష్కరాల నేపథ్యంలో మంత్రి పర్యటన సంతోషదాయకమన్నారు. స్థానిక దేవాలయాల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఫేజ్1 కింద రూ.9.55 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని చెప్పారు.

రాజమండ్రి పార్లమెంట్ సభ్యురాలు దగ్గుబాటి పురంధరేశ్వరి మాట్లాడుతూ గోదావరి పుష్కరాలు దేశ వ్యాప్తంగా ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన మహోత్సవమని అన్నారు. యాత్రికులకు అన్ని విధాలా సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. దేవాలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల విస్తరణ ద్వారా పుష్కరాలను ఘనంగా నిర్వహించేందుకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు. ఎంఎల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి మంత్రి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం అభినందనీయమని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి రూ.200 కోట్ల నిధులు మంజూరు చేయించేందుకు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ కే రామచంద్ర మోహన్, ప్రాంతీయ జాయింట్ కమిషనర్ వీ త్రినాధరావు, రాష్ట్ర స్థపతి పీ పరమేశ్వరప్ప, కేఆర్ఆర్సీ ఎస్‌డీసీ కే భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ శేఖర్, ఎస్ఈ దుర్గేష్, డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, జిల్లా దేవదాయ అధికారి ఈవీ సుబ్బారావు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉదయ్ కుమార్, ఏఈ కళ్యాణ్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కార్యనిర్వహణ అధికారులు విశ్వనాథ్ రాజు, లక్ష్మీబాయి, నాగేశ్వరరావు, తారకేశ్వరరావు, వీ శ్రీదేవి, రమేష్, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

# సోమవారం యధావిధిగా పీజీఆర్ఎస్ రెవెన్యూ క్లినిక్

### - జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 12..** ఏప్రిల్ 13వ తేదీ సోమవారం కాకినాడ జిల్లాలో పీజీఆర్ఏ, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వివిధ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమం జిల్లా స్థాయిలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కాకినాడ కలెక్టరేట్ గ్రివెన్స్ హాలులోను, రెవెన్యూ అంశాలపై రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం వివేకానంద హాలుపైన నిర్వహించడం జరుగుతుందని జిల్లాస్థాయి అధికారులు అందరూ విధిగా ఈ కార్యక్రమాలకు హాజరు కావాలన్నారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇంకా పరిష్కారం కాకపోయినా లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేసి సంప్రదించ వచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam. ap.gov.in వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చును. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో కూడా సమర్పించవచ్చు.



# ఇంకెంత కాలం.. ఈ అరాచకాలు

## ఇసుక మాఫియా ఆగడాలు అరికట్టాలి

- కొనసాగుతున్న మల్లయ్యపేట వాసుల నిరసన దీక్షలు
- మార్మోగిన "సేవ్ మల్లయ్య పేట- సేవ్ రాజమండ్రి" నినాదాలు
- రేపు కలెక్టర్ ను కలసి వినతిపత్రం అందించనున్న స్థానికులు

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** ఇష్టారాజ్యంగా అధిక లోళ్ళతో అక్రమంగా ఇసుకను తరలిస్తూ దుమ్ము ధూళిమయంగా మల్లయపేట ప్రాంతాన్ని చేస్తున్న ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టాలని మల్లయ్యపేట వాసులు చేస్తున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి సిటీ బీసీ సెల్ అధ్యక్షుడు పీతా రామకృష్ణ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ నిరసన దీక్షలో "సేవ్ మల్లయ్యపేట- సేవ్ రాజమండ్రి" పేరుతో నినాదాలు హోరెత్తాయి. ఇసుక మాఫియా లాభాలు పొందుతూ ఆ లారీల ద్వారా వచ్చే దుమ్మూ ధూళికి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆయన మండిపడ్డారు. సేవ్ మల్లయ్య పేట- సేవ్ రాజమండ్రి పేరుతో స్థానికుల నుంచి సంతకాలు సేకరించామని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరిని కలసి ఆమెకు వినతి పత్రం సమర్పిస్తామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇసుక మాఫియా చెలరేగిపోతుందని ఆయన అన్నారు. వారి సంపాదన తప్ప ప్రజల కష్టాలు, బాధలు, సమస్యలు పాలకులకు పట్టడం లేదని, అధికారులు కూడా వారి ఆగడాలకు వత్తాసు పలకడం సమంజసం కాదన్నారు.

**పిఎం సూర్య ఘర్ ముప్తి బిజిలి యోజన పథకం క్రింద...**

**ఎస్సి లబ్ధిదారునికి**

# ఉచిత సోలార్ యూనిట్

**పంపిణి చేసిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్య ప్రభ**



**ఏలేశ్వరం (మనసులో మాట) ఏప్రిల్ 12..** ఏలేశ్వరం మండలం లోని పేరవరం గ్రామంలో ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు పీఎం సూర్యగర్ ముఫ్తీ బిజిలి యోజన పథకం ద్వారా గ్రామంలో ఎస్సీ ఎస్టీ లబ్ధిదారులకు ఉచిత సోలార్ యూనిట్ పంపిణీ పథకంను కూటమి ప్రభుత్వం ద్వారా ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమం లోఎంపీపీ గొల్లపల్లి బుజ్జి జ్యోతుల పెదబాబు బీజేపీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ పెంటకోట శ్రీధర్ నుకతాటి ఈశ్వరుడు .కర్రీ సుబ్బారావు కర్రీ సూర్యప్రకాశరావు పేరవరం గ్రామ కూటమి నాయకులు మండల స్థాయి కూటమి నాయకులు హాజరవడం జరిగింది. ఏ పి ట్రాన్స్ కో జగ్గంపేట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వీరభద్రరావు ఏలేశ్వరం ఏ.ఈ జి.సూర్యనారాయణ మండల స్థాయి అధికారులు అధికారులు హాజరవడం జరిగింది.

# రైతన్నల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యం

## - రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ - కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట మనసులో మాట ఏప్రిల్ 12..** మీ భూమి మీకే సొంతం, ఆ భూమిపై మరెవ్వరికీ హక్కు లేదు అని చాటడానికి రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలను అందిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నరు. ఆత్రేయపురం మండలం మెర్లపాలెంలో ఆదివారం జరిగిన పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో ఆయన ఆర్డీవో మమ్మీ, అనపర్తి నియోజకవర్గ తెదేపా పరిశీలకులు ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు తదితరులతో కలిసి పాల్గొన్నారు. రైతన్నలకు పాస్ పుస్తకాలను పంపినిచేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న అన్నదాతల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. అందుకే జగన్మోహన్ రెడ్డి తీసుకువచ్చిన భూభక్షక చట్టమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రూపుమాపా మన్నారు. వైసీపీ ప్రభుత్వ హయంలో అన్నదాతల భూములకు రక్షణ లేకుండా పోయిందన్నారు. రీ సర్వే పేరుతో అవకతవకలు జరిగాయని, ఇప్పటికీ ఆ తప్పులు సరిదిద్దడానికి నానా అవస్థలు అధికారులు పడుతున్నారన్నారు. సరిహద్దు రాళ్లపై, పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్ తన బొమ్మలు వేసుకుని రైతన్నలకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. అప్పట్లో ధాన్యం కొనుగోళ్ల నగదు ఎప్పుడు జమవుతుందో తెలిసేది కాదన్నారు. ఇప్పుడు ధాన్యం కొనుగోలు చేసిన కొన్ని గంటల్లోనే రైతుల ఖాతాలో నగదు జమవుతుందన్నారు. అప్పట్లో గవర్నమెంట్ ఆఫీసులకు సైతం వైసీపీ రంగులు వేసుకున్నారన్నారు. జగన్ అధికారంలోకి వస్తే ఎవ్వరి భూమికి రక్షణ ఉండదన్న సంగతి గుర్తించే ప్రజలు గత ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుచిత్తుగా ఓడించి 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. మరో రెండు తరాలు గడిచిన జగన్ చేసిన తప్పులు ప్రజలు మర్చిపోరన్నారు. కూటమి ప్రభుత్వం హయాంలో నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు ప్రభుత్వ రాజముద్రతో పంపిణీ చేస్తున్నామన్నారు. పట్టాదారు పాసు పుస్తకం పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మన భూమి ఎక్కడ ఉందో తెలుస్తుందని,రైతుల వివరాలన్నీ వస్తాయన్నారు. తప్పులు పొరపాట్లు లేకుండా పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామన్నారు. రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న నిబద్ధతకు ఇదే నిదర్శనమన్నారు.

# చదువు భయంతో ఇల్లు వదిలిన విద్యార్థి

## - 4 గంటల్లోనే ఛేదించిన అమలాపురం పోలీసులు



**అమలాపురం(మనసులోమాట) ఏప్రిల్ 12:** చదువు ఒత్తిడితో తల్లిదండ్రులను వదిలి వెళ్ళిపోయిన ఓ తొమ్మిదో తరగతి విద్యార్థిని అమలాపురం పట్టణ పోలీసులు అత్యంత చాకచక్యంగా గాలించి, కేవలం నాలుగు గంటల వ్యవధిలోనే సురక్షితంగా పట్టుకున్నారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి అసాధ్యమైన ఆచూకీని సుసాధ్యం చేసిన పట్టణ సీఐ వీరబాబు, వారి బృందాన్ని స్థానికులు కొనియాడుతున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అమలాపురం పట్టణం దుడ్డి వారి అగ్రహారానికి చెందిన కాజా సురేష్ కుమారుడు అశ్విన్ స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం బయటకు వెళ్లిన అశ్విన్ ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు అతని గదిని పరిశీలించారు. అక్కడ అశ్విన్ రాసిన ఒక లేఖ లభ్యమైంది. "చదువు తనకు ఇబ్బందిగా మారిందని, పదో తరగతి కూడా పాస్ కాలేననే భయంతో ఇంటి నుంచి వెళ్ళిపోతున్నాను" అని ఆ లేఖలో పేర్కొన్నాడు. ఆఉత్తరం చదివి కంగారుపడిన తల్లిదండ్రులు వెంటనే అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ వీరబాబు వెంటనే అప్రమత్తమై ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. పట్టణంలోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించగా, అశ్విన్ అమలాపురం బస్టాండ్‌లో విజయవాడ బస్సు ఎక్కినట్లు ప్రాథమికంగా గుర్తించారు. పోలీసులు బస్సును వెంబడించే లోపే, విద్యార్థి మరో చోట దిగిపోవడంతో పోలీసులకు సవాల్ గా మారింది. ఈ క్రమంలో పోలీసులు వెనక్కి తగ్గకుండా అత్యున్నత సాంకేతికతతో విద్యార్థి ఫోటోను సంబంధిత నెట్‌వర్క్ ఏరియాలకు పంపి, విజయవాడ సెంట్రల్ కార్యాలయం నుంచి అందిన సమాచారం ఆధారంగా అశ్విన్ ఉన్న ప్రదేశాన్ని నిమిషాల్లో గుర్తించారు. వెనువెంటనే స్పందించిన పోలీసులు విజయవాడలో విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. తమ కుమారుడిని సురక్షితంగా కాపాడినందుకు అశ్విన్ తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమవుతూ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కేవలం 4 గంటల వ్యవధిలోనే ఆచూకీ పట్టుకోవడంలో అమలాపురం పోలీసులు చూపిన సమయస్ఫూర్తి ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుతం పట్టణ పోలీసు బృందం విద్యార్థిని తీసుకురావడానికి విజయవాడ బయలుదేరి వెళ్ళారు.

# కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో జ్యోతుల నవీన్ కు ఘన సత్కారం



**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 12..** జగ్గంపేట మండలం ఇర్రిపాక ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వ్యవసాయ క్షేత్రంలో కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షుడు జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ ను జగ్గంపేట నియోజకవర్గం కాకతీయ కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి అన్నవరం సత్యనారాయణ స్వామి వారి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందించారు. అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడిగా నూతనంగా నియమితులైన పాలచర్ల నాగేంద్ర చౌదరి హైదరాబాదులో ప్రత్యేకంగా తయారు చేయించిన నవీన్ చిత్రపటాన్ని ఆయనకు బహుకరించారు. ఈ సందర్భంగా నాగేంద్ర చౌదరి మాట్లాడుతూ మా అభిమాన నేత జ్యోతుల నెహ్రూ నా అభిమాన యువనేత జ్యోతుల నవీన్ ఆశీస్సులతో అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ గా సిఫార్సు చేసినందుకు ఎప్పటికీ వారికి ఋణపడి ఉంటానని వారి ఆశీస్సులతో అన్నవరం దేవస్థానం మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు నా వంతు కృషి చేస్తానని అన్నారు. ఆదివారం జగ్గంపేట కాకతీయ కమ్మ సంఘం పెద్దలు పలువురు ఈరోజు కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ ని మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేసి చిరు సత్కారం చేసామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమ్మ సంఘం అధ్యక్షుడు కే రామచంద్రరావు , ఎం ఎర్ర బాబు , ఎస్ నాగేశ్వరరావు , కే ప్రకాష్ , ఐ రాంబాబు , ఎన్ గంగరాజు , బి ఆంజనేయులు , ఆర్ ఆంజనేయులు, దాసరి శీను, ఈ ప్రసాద్ , కె వీరబాబు, యు సురేంద్ర , కే రామకృష్ణ , కే బుల్లబు , గుణ్ణం శ్రీనివాస్, రెడ్డి సాయి , ఆర్ విజయ్ కుమార్, జి హరికృష్ణ, కే బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.



### యువత క్రీడలలో

## రాష్ట్ర, దేశ స్థాయిలో రాణించాలి

### - నారా లోకేష్ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 12..** యువత క్రీడలలో రాణించి రాష్ట్రానికి, దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని నారా లోకేష్ యువజన ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మండపాక సుబ్బు అన్నారు.స్థానిక విద్యుత్ నగర్ ఐడియల్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ టీం ఆర్ట్స్ అవెంజర్కి క్రీడా సామగ్రి,నారా లోకేష్ యువజన ఫౌండేషన్ ముద్రించిన స్పోర్ట్స్ టి షర్ట్స్ సుబ్బు,ఫౌండేషన్ సభ్యులు అందించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షులు మండపాక సుబ్బు పాల్గొని టీం ని పరిచయం చేసుకొని వారికి శీతల పానీయాలు ఏర్పరిచారు. క్రీడలలో రాణించాలని సూచించారు. అదేవిధంగా చదువుతోపాటు ప్రతి ఒక్కరు క్రీడలను ప్రోత్సహించాలని అన్నారు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు క్రీడలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బత్తుల సూర్య ప్రసాద్ ప్రత్తిపాడు ఫౌండేషన్ అధ్యక్షులు అడపా జగదీష్ కాలాడి వెంకటేష్ టీం సభ్యులు అభిమానులు పాల్గొన్నారు.

## విఘ్నేశ్వరుని సన్నిధిలో అక్షర శ్రీకారం



**అయినవిల్లి (మనసులో మాట) ఏప్రిల్ 12..** చైత్ర మాస బహుళ దశమి ఆదివారం సందర్భంగా అయినవిల్లి మండలం అయినవిల్లి శ్రీ సిద్ధి వినాయక స్వామి వారి సన్నిధిలో భక్తుల సందడి నెలకొంది. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని పలువురు తల్లిదండ్రులు తమ చిన్నారులకు స్వామివారి సమక్షంలో అక్షరాభ్యాస వేడుకలు నిర్వహించారు. విద్యాధిదేవుడైన గణపతి చెంత అక్షర శ్రీకారం చుట్టించడం వల్ల పిల్లలకు విద్యతో పాటు విజ్ఞానం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, చిన్నారుల చేత ఓంకారాన్ని దిద్దించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది.

## ఏప్రిల్ 18 తేది న లేదా 19 తేది న ఇంటర్ ఫలితాలు

**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 12..** ఏపీ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈ నెల 18 వ తేదిన గాని 19 వ తేదీల్లో విడుదల చేసేందుకు ఇంటర్మీడియట్ విద్యా మండలి కసరత్తు చేస్తోంది. మూల్యాంకన ప్రక్రియ పూర్తికాగా ఫలితాల విడుదలకు ప్రాసెస్ కొనసాగుతోంది. ఇది ఈ నెల 16 కల్లా ముగిసే అవకాశముంది. ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమైన పబ్లిక్ పరీక్షలు మార్చి 23 వరకు జరిగాయి. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంలో కొంత ఆలస్యమైంది.

# చీడిగ గ్రామంలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహానికి శంకుస్థాపన

### - బలహీన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా విగ్రహ నిర్మాణం - మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతులు



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 12..** శెట్టిబలిజ సమాజ ఆర్థిక, సామాజిక, విద్యా అభివృద్ధి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు స్వర్గీయ దొమ్మేటి వెంకటరెడ్డి స్మారకంగా విగ్రహ శంకుస్థాపన కార్యక్రమం చీడిగ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. చీడిగ గ్రామ మాజీ సర్పంచ్ పితాని అప్పన్న ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు హాజరయ్యారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తంగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ ఇటీవల శెట్టిబలిజ సంక్షేమ సంఘ స్థాపకుడు, సామాజిక విప్లవ నాయకుడు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసి కార్యక్రమాన్ని నిర్వహించడం శెట్టిబలిజ సమాజానికి చారిత్రాత్మక ఘట్టమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషిని జాతి ఎప్పటికీ మరిచిపోదని అన్నారు. వారి స్ఫూర్తితో నియోజకవర్గంలోని చీడిగ గ్రామంలో దొమ్మేటి వెంకటరెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఏర్పాటుతో బలహీన వర్గాల్లో ఆత్మగౌరవ జ్యోతిని వెలిగించిన మహనీయుడు దొమ్మేటి వెంకటరెడ్డి" అని వారు కొనియాడారు. కులవివక్ష, అంటరానితనం తీవ్రంగా ఉన్న కాలంలో విద్య ద్వారానే సాధికారత సాధ్యమని విశ్వసించి అణగారిన వర్గాల విద్యాభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. అతని సామాజిక సంస్కరణలు, సమానత్వం కోసం చేసిన పోరాటం నేటికీ ప్రేరణగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంలోనూ ఆయన విశేష పాత్ర పోషించి, అణగారిని వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడిన మహనీయుడని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో నులుకుర్తి వెంకటేశ్వరరావు, పితాని అప్పన్న, పంపన బుజ్జి, గుత్తుల రామలింగేశ్వర రావు, పిల్లి రవణమ్మ, నీలం రాంబాబు, భాస్కర్ రావు, శాస్త్రి, కాకరపల్లి మోహను, పుల్లయ్య శ్రీను పాల్గొన్నారు.

# ఏఐటియుసి కాకినాడ జిల్లా నూతన కౌన్సిల్ ఎన్నిక

### - 26 తేదిన హలో కార్మిక చలో తిరుపతి...









**కాకినాడ (మనస్సు మాట) ఎప్రైల్ 12..** ఏఐటీయూసీ కాకినాడ జిల్లా నూతన కౌన్సిల్ 29 మందితో ఏకగ్రీవంగా ఎన్నికయింది 13 మంది తో కార్యవర్గశీ ఎన్నికయ్యిందిని ఏఐటీయూసీ నూతన ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఉదయం స్థానిక పొన్నమండ రామచంద్రరావు భవన్ లో పాత్రికేయుల సమావేశం జరిగింది. ముందుగా ప్రసాద్ నూతన నాయకత్వాన్ని పరిచయం చేశారు. గౌరవ అధ్యక్షులుగా తాటిపాక మధు, అధ్యక్షులుగా కసింకోట కిషోర్ కుమార్ వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి శ్రీనివాసరావు ప్రధాన కార్యదర్శి గా తోకల ప్రసాద్ ఉపాధ్యక్షులుగా బి స్వామి బాబు, ఎం దుర్గాప్రసాద్, తలాటి వీరబాబు, తుపాకుల లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శులు గా టి.అన్నవరం, వనమాడి వీరవేణి కె.వి రామయ్య కోశాధికారిగా పి.సత్యనారాయణలు ఎన్నికయ్యారని ప్రసాద్ తెలిపారు ఈ నెల 26,27,28 తేదీలలో తిరుపతి లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని చెప్పారు మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు హమాలీ కార్మికులకు సంక్షేమ సమగ్ర చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ సిబ్బంది కి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

# ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి..

### - ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి స్పష్టీకరణ




**ఏలూరు, ఏప్రిల్ 12(మనసులో మాట)..** ముస్లిం మైనార్టీల అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో వారి భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని స్పష్టం చేశారు. ఏలూరు 1టౌన్‌లోని అంజుమన్ ఫంక్షన్ హాల్లో హజ్ యాత్రకువెళ్ళే హాజీలకు ఆదివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి హాజీలకు మెడికల్ కిట్లు, బ్యాగులు, మెడికల్ వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముస్లింలను అన్నివిధాలా ఆదుకునేందుకు చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. ముస్లింల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్ళి వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. హజ్ యాత్రికులకు ఇచ్చే లక్ష రూపాయల సాయాన్ని యాత్రకు ముందుగానే అందించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పార్టీలకు అతీతంగా ముస్లింలకు అన్ని విధాల సహాయ,సహకారాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని భరోసా కల్పించారు.



## వైభవంగా షిరిడి సాయి, దత్తాత్రేయ, గణపతి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 12..** స్థానిక గోకవరం రోడ్ లోని నూతన షిరిడి సాయి ఆలయంలో షిరిడి సాయినాథ్, దత్తాత్రేయ స్వామి, గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు ఆదివారం ఉదయం జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షుడు జీనుమణి బాబు విజయలక్ష్మి దంపతులు విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. హోమం లో పూర్ణాహుతి సమర్పించి నూతన విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవరపల్లి మూర్తి దంపతులు మహిళా భక్తులకు చీరలు రవికలు పంపిణీ చేశారు. 5000 మందికి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాంబాబు, రేకాబుల్లిరాజు, బుర్రి సత్తిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, కంటిపూడి సత్యనారాయణ, వేములకొండ జోగారావు, అడబాల రామాంజనేయులు, పీలా మహేష్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### నేడు కలెక్టర్ కార్యాలయంలో

## యధావిధిగా పీజిఆర్ఎస్



**అమలాపురం మనసులోమాట ఏప్రిల్ 12..** నేడు డాక్టర్ బిఆర్అంబెద్కర్ కోనసీమ జిల్లా కార్యాలయంలో పిజిఆర్ఎస్ మీకోసం రెవెన్యూ క్లినిక్ యథావిధిగా నిర్వహించ డం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి భవన్ నందు అదే విధంగా డివిజన్ మండల కేంద్రంలో మీకోసం కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కార వేదిక , రెవెన్యూ క్లినిక్ యథావిధిగా నిర్వహిస్తార న్నారు. అర్జీదారులు తమ అర్జీలను వీవవనిశీయిఎ.ఖజూ. స్త్రశీజ.ఱఅ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో కూడా నమోదు చేసుకుని పరిష్కార మార్గా లు పొందాలన్నారు. అలాగే నమోదైన అర్జీల ప్రస్తుత స్థితి తదితర వివరాల కోసం 1100 టోల్ ఫ్రీ నెంబర్ కు నేరుగా కాల్ చేసి పరిష్కార స్థితిగతులను తెలుసుకొనవచ్చునని సూచించారు. జిల్లా కేంద్రం తో పాటు డివిజన్ మండల స్థాయిలలో కూడా మీకోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు యధా విధిగా నిర్వహిస్తారన్నారు. రెవెన్యూ డివిజన్ అధికారులు, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు జిల్లా స్థాయిలో రెవెన్యూ క్లినిక్కు హాజర వుతారన్నారు. తహశీల్దార్లు తమ ప్రధాన కార్యాలయాల నుంచి హాజరై ప్రజల అర్జీలను స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతారని ఆ ప్రకటనలో కలెక్టర్ పేర్కొన్నారు.

# చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి

**- పార్లమెంట్ లో బీసీ రక్షణ చట్టం చేయాలి - బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి**

**- బీసీ జనగణన చేసి.. జనాభా ప్రాతిపదిక బడ్జెట్టు కేటాయించాలి - జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు**

**- మహిళా రిజర్వేషన్లలో బీసీ కోటా పెట్టాలి - జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెలగల నూకాలమ్మ**

**- జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండపేట అధ్యక్షునిగా వాసంశెట్టి వెంకటరమణ నియామకం**




**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై నాగేశ్వరరావు డిమాండు చేశారు. స్థానిక సూర్య హోటల్లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వై నాగేశ్వర రావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ స్థాయిలో బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయడమే కాకుండా బీసీ రక్షణ చట్టాన్ని తీసుకు రావాలని కోరారు. బీసీ జన గణన చేసి జనాభా ప్రాతిపదికన బడ్జెట్లో బీసీలకు నిధులు కేటాయించాలన్నారు. మహిళలకు చట్ట సభలలో రిజర్వేషన్ కల్పించే బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తామని, అయితే మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ కోట కల్పించాలని కోరారు. బీసీలకు ఉద్యోగాల్లో పదోన్నతులు కల్పించాలని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం గల్లీ నుండి ఢిల్లీ స్థాయి వరకు పటిష్ఠవంతమైన కమిటీలను ఏర్పాటు చేసి బీసీల హక్కులపై పోరాటం సాగిస్తోందన్నారు. పూలే జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ అమలు చేస్తూ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని అన్నారు. రాష్ట్రంలో విద్యాపరంగా మంత్రి లోకేష్ తీసుకుంటున్న సంస్కరణలు అభినందినీయమన్నారు. ప్రతి జిల్లాలో బీసీ భవనాలు నిర్మిస్తామని, బీసీ హాస్టల్ అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇవ్వటం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. టీడీపీలోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. సంఘాన్ని పటిష్టం చేయడంలో భాగంగా మండపేట నియోజకవర్గం అధ్యక్షునిగా వాసంశెట్టి వెంకటరమణను నియమించామన్నారు. ఆయన మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి త్వరలోనే భారీ సభను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ఆశయ సాధనకు రాష్ట్రంలో సంఘాన్ని పట్టిష్టవంతం చేయడానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు లబ్ధిక మల్లేష్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, రాష్ట్ర ఇంచార్జ్ వెలగల నూకాలమ్మ మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ కోటాను అమలు చేయాలని కోరారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై ఈ నెల 16, 17, 18 తేదీలలో ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం సుదీర్ఘ పోరాటాల కారణంగా బీసీల కొరకు అనేక సంక్షేమ పథకాలు అమల్లోకి వచ్చాయన్నారు. బీసీలకు రావలసిన వాటా పై రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వంలో బీసీలకు ప్రాధాన్యత దక్కుతుందన్నారు. కార్పొరేషన్ ల చైర్మన్ లతో పాటు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకువస్తామన్న హామీని నెరవేర్చాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిను పలుమార్లు కలిసి చర్చించామన్నారు. జనాభాలో సగ భాగంగా ఉన్న బీసీల కుల లగణన జరగాలన్నారు. బీసీ జనాభా లెక్కలు లేకపోవటం వల్ల బీసీలకు న్యాయం జరగట్లేదు అన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు లద్ధిక మల్లేష్ మాట్లాడుతూ త్వరలోనే రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో యువజన విభాగాల కమిటీలు ఏర్పాటు చేసి, ఆగస్టులో భారీ సభను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బీసీలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండపేట అధ్యక్షుడు వాసంశెట్టి వెంకటరమణకు, యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి బీ నాగ వెంకట రమేష్ లకు నియామక పత్రాలను అందజేసి, సంఘం కండువాలు వేసి సత్కరించారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ ట్రస్ట్ బోర్డు డైరెక్టర్గా నియమితులైన కొల్లిబోయిన శ్రీనివాసరావు యాదవ్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ గా నియమితులైన దాలిపర్తి వేమన, రజక కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్ లను సత్కరించారు. విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు కేకే సంజీవరావు, బూర హనుమంతరావు, యువజన విభాగం నగర అధ్యక్షుడు కాపరపు కిరణ్ కుమార్, రాజనాల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నూతన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటాలు తీవ్రతరం చేయాలి

**- ఐఎఫ్‌టీయూ పిలుపు**




**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 12..** భారత కార్మిక సంఘాల సమాఖ్య ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గ సమావేశం జగ్గంపేటలోని స్టాలిన్ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కూలీ సూరిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడానికి ప్రయత్నిస్తున్న నాలుగు నూతన లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం కలిగిస్తాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక వర్గం తమ హక్కుల కోసం మరింత ఉత్సాహంతో పోరాటాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. గత నవంబర్ 21న కూటమి ప్రభుత్వం 10 గంటల పనిదినాన్ని ప్రవేశపెట్టి పెట్టుబడిదారులకు అనుకూలంగా చర్యలు తీసుకుందని విమర్శించారు. 1998 కార్మిక చట్టంలోని కొన్ని సెక్షన్‌ల నుండి మినహాయింపులు ఇవ్వడం కార్మికుల హక్కులను దెబ్బతీసిందన్నారు. వారానికి 48 గంటలు మాత్రమే పని చేయాలని, అదనంగా పని చేస్తే ఓవర్‌టైమ్ ఇవ్వాలని చట్టంలో ఉన్నప్పటికీ, అది ఎక్కడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. 24 గంటలు షాపులు, వాణిజ్య సంస్థలు తెరవడానికి కార్మిక శాఖ ఉత్తర్వులు జారీ చేయడం కార్మికులకు ద్రోహం చేయడమేనని అన్నారు. అలాగే 31-03-2026తో ముగిసిన వేతనాల జీవోను వెంటనే పునరుద్ధరించి, నూతన వేతనాల జీవోను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ మరియు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు అనుకూలంగా తీసుకొస్తున్న విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం తిరగబడాలని పిలుపునిచ్చారు. అలాగే అమెరికా, ఇజ్రాయెల్ సామ్రాజ్యవాద దాడులకు వ్యతిరేకంగా, నూతన కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా ఈ సంవత్సరం మేడేను పోరాట దినంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కూలీ సూరిబాబు, ఉపాధ్యక్షుడు వి. చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి బి. సిద్ధూ, కోశాధికారి చింతా రాజారెడ్డి, సభ్యులు ఎస్.కే. భాషా, నందూరి సతీష్, రమణ తదితరులు పాల్గొన్నారు



అన్ని రంగాల్లోనూ

## మహిళల పాత్ర కీలకం

### ఏలేశ్వరం నగర పంచాయతీ... మాజీ చైర్మన్ అలమండ సత్యవతి

**ఏలేశ్వరం (మనసులో మాట) ఏప్రిల్ 12..** సమాజంలోని అన్ని రంగాలలోనూ మహిళలలు కీలక పాత్ర ఎంతో ముఖ్యమైనదని ఏలేశ్వరం నగర పంచాయతీ తాజా మాజీ చైర్పర్సన్ అలమండ సత్యవతి అన్నారు. ఈ నెల 15 న జరిగే ప్రత్తిపాడు కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ లేకుండా కోశాధికారి పదవికి ఏకగ్రీవంగా ఎన్నికైన ఏలేశ్వరం న్యాయవాది ఏలేశ్వరం మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ అయిన అవసరాల దేవిని ఆమె ఆదివారం ప్రత్యేకంగా ఇంటి కి వెళ్లి ఆమెని కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యా, వైద్యం, ఉద్యోగాలతో పాటు చట్టసభల్లోనూ సగభాగం ఉండాలని ఆమె ఆకాంక్షించారు. న్యాయవాది అవసరాల దేవి మరిన్ని పదవులు చేపట్టాలని, సమాజంలో ఇప్పటికీ వివక్షతకు గురి అవుతున్న మహిళల సమస్యల పై తన గళం విప్పి పోరాడాలని కోరారు. ఈ సందర్భంగా అవసరాల దేవి మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో తనను పోటీ లేకుండా గెలిపించిన సీనియర్ జూనియర్ న్యాయవాదులకు ఎంతో రుణపడి ఉంటానని అన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా బార్ అసోసియేషన్ విధులు, న్యాయవాదుల హక్కులు, సమస్యల పరిష్కారానికి ముందుంటానని పేర్కొన్నారు.

### పంట నష్టాన్ని పరిశీలించిన

## జిల్లా వ్యవసాయాధికారులు..



**గొల్లప్రోలు, (మనసులో మాట) ఏప్రిల్ 12:** అకాల వర్షాలు, గాలుల వల్ల దెబ్బతిన్న పంటలను కాకినాడ జిల్లా వ్యవసాయ అధికారి ఎన్. విజయ్ కుమార్, పిఠాపురం సహాయ సంచాలకులు పి. స్వాతి ఆదివారం పరిశీలించారు. మండలంలోని మల్లవరం, చేబ్రోలు, లక్ష్మీపురం గ్రామాల్లో పర్యటించి, రైతులకు వాటిల్లిన నష్టంపై ఆరా తీశారు. ప్రాథమిక అంచనాల నివేదికను ఉన్నతాధికారులకు పంపామని, ప్రభుత్వ ఆదేశాలు రాగానే పరిహార ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చారు. నేలకొరిగిన పంటలకు తెగుళ్లు రాకుండా హెక్సాకోనాజోల్ పిచికారీ చేయాలని, పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని రైతులకు సూచించారు.

### ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు పూర్తి ఉచిత విద్యుత్తు యోజన పథకాన్ని

# సద్వినియోగం చేసుకోవాలి

- సోలార్ ప్యానెల్ ప్రతి ఇంటికి ఏర్పాటు చేసుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలి
- సోలార్ విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గృహాలకు అవసరమైన విద్యుత్తును మనమే ఉత్పత్తి చేసుకోవచ్చును
- ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ ఏర్పాట్లు చేసుకునేలా విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించాలి - రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి



**ఏలూరు/నూజివీడు, ఏప్రిల్ 12 (మనసులో మాట)..** నూజివీడు మండలం బత్తులవారిగూడెం గ్రామంలో ఆదివారం ప్రధానమంత్రి సూర్యఘర్ యుయల్ ఏ మోడ్ - ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు సూర్య ఫలకాల గ్రిడ్ అనుసంధాన కార్యక్రమంలో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా మాజీ సర్పంచి డి.వెంకటరత్నం (ఎస్సీ) ఇంటికి ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు పూర్తి ఉచిత విద్యుత్తు యోజన పథకం ద్వారా సోలార్ ప్యానెల్ ను మంత్రి కొలుసు పార్థసారథి లాంఛనంగా ప్రారంభించారు. సూర్యాంధ్ర ప్రగతి రథాన్ని మంత్రి జెండా ఊపి ప్రారంభించి, బ్రోచర్లను ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ పియం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం ద్వారా రాష్ట్రంలో ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేసుకుని వినియోగించుకునేలా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టిందని అన్నారు. బొగ్గు ,పెట్రోల్, డీజిల్, భూమిలో నుంచి వచ్చే ఇతర పదార్థాలు వాడకాన్ని తగ్గించి, సౌర శక్తిని వినియోగించుకునేందుకు ప్రపంచ దేశాలు పోటీలు పడుతున్నాయని అన్నారు. మన భారతదేశం మొదటి వరుసలో ఉండగా, రాష్ట్రాల్లో మన ఆంధ్రప్రదేశ్ మొదటి వరుసలో ఉందని అన్నారు. ప్రజలకు సోలార్ ప్యానల్ ఏర్పాటుపై అవగాహన కల్పిస్తే పెద్ద ఎత్తున ప్రజలు ముందుకు వచ్చి సోలార్ విద్యుత్తును ఏర్పాటుకు సంసిద్ధంగా ఉన్నారని, ఇందుకు అధికారులు, బ్యాంకర్స్ కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలను సాధించాలని అన్నారు. ఈ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించడంలో కొంత వెనుకబడి ఉన్నామని, ఆర్థికంగా బలంగా ఉన్న ఈ జిల్లాలో ప్రజలకు అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలను సాధించవచ్చునన్నారు. ప్రతి సచివాలయంలో విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహించి, ప్రతి ఇంటికి ఒక అవగాహన కరపత్రం అందాలని, నూటికి నూరుశాతం సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చెయ్యాలని, మంచి సబ్సిడీ కల పథకమని మనకు ఎంతో లాభం కలుగుతుంది అన్నారు. పియం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన కింద ఆంధ్రప్రదేశ్‌లోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచితంగా రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్ అమర్చడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ గృహాలకు ఈ పథకం ద్వారా ఉచిత కరెంటు అందించుటకు శ్రీకారం చుట్టామని, దీనికి సంబంధించిన మౌలిక సదుపాయాల కల్పన మరియు రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సోలార్ ప్లాంట్లు ధరఖాస్తులు బ్యాంకులో పెండింగు లేకుండా రుణాలను మంజూరు చేయాలని అప్పుడే ఈ పథకానికి మంచి ప్రగతి కనపడుతుంది అన్నారు. పీఎం కుసుమ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు అవగాహన కల్పించి ఈ పథకాన్ని ప్రతి రైతుకు అందించాలని అన్నారు.

# యుద్ధాన్ని నిలుపుదల చేయాలి

## - శాంతి ర్యాలీ!!



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అహంకారం తో తనకు అనుకూలంగా ఉన్న దేశాలకు సపోర్ట్ చేస్తూ చిన్న దేశాలపై యుద్దానికి కాలు దువ్వుతున్న ట్రంపు వెంటనే యుద్దాన్ని నిలుపుదల చేయాలి ఇజ్రాయేల్ దేశం ఇరాన్ పై చేస్తున్న యుద్దానికి అనేక మైన ప్రజలు బలై పోతున్నారు. పసిపిల్లలు అని చూడకుండా స్కూల్ బిల్డింగ్లపై బాంబుల దాడి చేస్తూ అమాయక పసిపిల్లలను చంపుతున్నారు యుద్ధ ఉన్మాదం కారణంగా కోట్లాది రూపాయిలు ఆస్తినష్టలు జరగటమే కాక రవాణా సౌకర్యం లేక అన్ని దేశాలు సంక్షోహానికి గురవుతున్నాయి ఇప్పటికైనా ఐక్యరాజ్య సమితి కలుగజేసుకుని యుద్ధాలను నిలుపుదల చేయాలి లేకుంటే ఈ యొక్క యుద్ధాలు అన్ని దేశాలకి ప్రభవిల్లుతాదని వెంటనే యుద్ధాలు నిలుపుదల చేయాలని దళిత ప్రజాశక్తి అధ్యక్షులు మురారి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పౌర హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు సీనియర్ అడ్వకేట్ వేడంగి చిట్టిబాబు, కోణాల లాజరు ఆర్ పి ఐ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షులు, తదితర ప్రజా సంఘాలు పాల్గొని గోకవరం బస్టాండ్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడ నుండి దేవి చౌక్ వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు..



## రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు 24 మంది ఎంపిక..

**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 12 :** స్థానిక ఆర్ ఆర్ బి హెచ్ ఆర్ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్స్ (పురుషులు, మహిళలు) ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లా నలుమూలల నుండి సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన 12 మంది పురుషులు, 12 మంది మహిళలను కలిపి మొత్తం 24 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు నిర్వహణ కార్యదర్శి కోచ్ పి. లక్ష్మణరావు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19, 20 తేదీల్లో నెల్లూరులో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ ఎంపిక ప్రక్రియలో జె.ఎన్.ఎస్. గోపాలకృష్ణ, పి. కృష్ణ, పవన్, పి.ఈ.టి ఎల్. సతీష్‌లు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

## కోదండ రామాలయం వద్ద ఘనంగా అన్న ప్రసాద వితరణ..



**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 12:** స్థానిక చిట్టోడి తోట సమీపంలోని శ్రీ విద్యా గణపతి కోదండ రామాలయం వద్ద ఆదివారం భారీ అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. సీతారాముల కళ్యాణోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, 28వ వార్డు టీడీపీ ఇంచార్జి పొలిమేరు ప్రకాష్, సియాదుల సోమేశ్వరరావు, కొత్త రాంబాబు, శ్రీమన్నారాయణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు కి తీవ్ర గాయాలు



**అమలాపురం (మనసులోమాట) ఏప్రిల్12..** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధి పదో మైల్ రాయి సెంటర్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలు పాలై కొనఊపిరితో కుట్టుమిట్లాడాడు. ముమ్మిడివరం పదవ మైలురాయి వద్ద మోటార్ సైకిల్ పై వెళుతున్న యువకుడుని ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. రోడ్డు ప్రమాదం విషయాన్ని స్థానికులు ముమ్మిడివరం ఎస్ఐ జ్వాలా సాగర్ కు తెలపగా ఆయన హుటాహుటిన సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రునుని అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ ఐ తెలిపారు.

# డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రాతస్మరణీయులు

**- మంత్రి కందుల దుర్గేష్ - కొవ్వూరులో ఘనంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ**

**- పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు**



**కొవ్వూరు/ రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** ప్రపంచ వ్యాప్తంగా ఈ నెల 14న భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని జరుపుకుంటారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. కొవ్వూరు నియోజకవర్గం మద్దూరు లంక గ్రామంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దేశాల ముందు భారతదేశం సగర్వంగా తల ఎత్తుకునేలా చేసిన మహోన్నత మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని, ఆయన మనందరికీ ప్రాతస్మరణీయులని కొనియాడారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, మహిళలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించిన వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. దళితులు అణగదొక్కబడే వారు కాదని, వారు ఆత్మగౌరవంతో, ధైర్యంతో జీవించే శక్తి ఉన్నవారని, అంబేడ్కర్ విగ్రహం ఆ తరహా ఆత్మస్థైర్యాన్ని నింపుతుందని అభివర్ణించారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నియోజకవర్గ అభివృద్ధికి చేస్తున్న కృషిని




అభినందించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు గ్రామంలో ఎంపీ తో చర్చించి కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు తగిన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనేక ఉద్యమాల ద్వారా ప్రజల పక్షాన నిలుస్తున్న యువ నాయకుడు జీవీ శ్రీనివాస్‌ను ఈ సందర్భంగా మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ జై భీమ్ అని నినదించారు. కార్యక్రమంలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, భారీ సంఖ్యలో ప్రజలు, అంబేడ్కర్ సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు. ఏప్రిల్ 14న రాబోయే అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఈ విగ్రహావిష్కరణ జరగటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# పేద ప్రజలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి


**- సోలార్ రూఫ్ టాప్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే గోరంట్ల..**



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** పేద ప్రజలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో ప్రతి ఒక్కరూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవాలని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. కడియం మండలం కడియపుసావరం గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్ ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ మన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ విద్యుత్తును అందిస్తున్నామని, మిగిలిన వర్గాల వారికి కేంద్ర ప్రభుత్వం ద్వారా ఒక కిలో వాట్ కు 30,000, రెండు కిలోవాట్లకు 60,000, మూడు కిలోవాట్లకు 78,000 చొప్పున సబ్సిడీ లభిస్తుందన్నారు. ఈ పథకంలో ఒక్కసారి పెట్టుబడి పెడితే 20 సంవత్సరాల పాటు ఇంటికి కావలసిన విద్యుత్తును వినియోగించుకోవడంతో పాటు అదనంగా మిగిలిన విద్యుత్తును సంస్థకు అమ్మడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. రూఫ్ టాప్ ను ఏర్పాటు చేసుకోవడానికి వివిధ బ్యాంకులు అతి తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తున్నాయన్నారు. ఈ పథకం గృహ వినియోగదారులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్తు శాఖ అధికారులు నటరాజన్, సన్యాసిరావు, ఎంపీడీవో కే రమేష్, కడియం మండల టీడీపీ అధ్యక్షుడు వెలుగుబంటి రఘురాం, గ్రామ పార్టీ అధ్యక్షుడు వరగోగుల వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ చెక్కపల్లి మురళీకృష్ణ, నాగిరెడ్డి రామకృష్ణ, చెల్లుబోయిన శ్రీనివాస్, శీలం రవి, వరగోగుల సత్యనారాయణ, రుద్రయ్య, విప్పర్తి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మందపల్లిలో రూ.4.2 కోట్లతో

# తైలాభిషేకం మండపం, అన్నదాన భవనలకు శంకుస్థాపన



**కొత్తపేట మనసులో మాట ఏప్రిల్ 12..** మందపల్లి క్షేత్రాల్లో రూ. 16. 2కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, కొత్తపేట జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, అనపర్తి తెదేపా నియోజకవర్గ పరిశీలకులు ఆకుల రామకృష్ణ, దేవాదాయ శాఖ కమిషనర్,కె వి సత్యనారాయణ రెడ్డి, పాలూరి సత్యానందం,చిలువూరి సతీష్ రాజు, కుసంపూడి రామకృష్ణరాజు పాల్గొన్నారు.

మొదలైనవారు పాల్గొన్నారు.

మందేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందపల్లిలో రూ. 3 కోట్లతో చేపట్టిన తైలాభిషేక మండపం, రూ. 1. 2కోట్లతో చేపట్టిన నిత్యాన్నదాన భవనాలకు శంకుస్థాపన చేశారు. వచ్చే 2027 గోదావరి పుష్కరాలకు ఆయా పనులను పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు

మనసులో మాట



## అంబేద్కర్ కాంస్య విగ్రహ శంకుస్థాపనకు

# ఎమ్మెల్యే నెహ్రూ కు ఆహ్వానం

**జగ్గంపేట (మనసులో మాట) ఏప్రిల్ 12..** స్థానిక రావులమ్మ నగర్ లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఆదివారం జగ్గంపేట జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీన జరగబోయే అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలకు అంబేద్కర్ స్మారక మందిరం కాంస్య విగ్రహం శంకుస్థాపన మహోత్సవానికి జగ్గంపేట ఎమ్మెల్యే తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుడు జ్యోతుల నెహ్రూకు ఆహ్వాన పత్రం అందించి ఆహ్వానించారు.ఈ సందర్భంగా జగ్గంపేట మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాంబత్తుల చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 జయంతి ఉత్సవాలు జగ్గంపేటలో జై భీమ్ యూత్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామని అదే రోజున అంబేద్కర్ స్మారక మందిరం కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడానికి శంకుస్థాపన మహోత్సవం నిర్వహించేందుకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు ఆహ్వాన పత్రం అందించామని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట జై భీమ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## థాయిలాండ్ లో ప్రపంచ వెట్రన్

# అథ్లెటిక్స్ పోటీలకు కాకినాడ క్రీడాకారుడు



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 12..** ఏప్రిల్ 17తేదీ నుంచి థాయిలాండ్ లో జరుగు ప్రపంచ వెట్రన్ అథ్లెటిక్స్ పోటీల్లో భారతదేశం తరపున పాల్గొనడం జరుగుతుందని కాకినాడ చిత్రాడ కు చెందిన వెటరన్ క్రీడాకారుడు పెద్దపాటి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం కాకినాడలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. థాయిలాండ్ లో ఏప్రిల్ 17 వ తేదీ నుంచి 20 తేదీ వరకు వెట్రన్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వరల్డ్ మాస్టర్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వెట్రన్ అథ్లెటిక్స్ పోటీలలో వివిధ దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొంటున్నారని చెప్పారు . భారతదేశం తరఫున తాను ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈనెల 14 థాయిలాండ్ బయలుదేరి వెళుతున్నట్లు పేర్కొన్నారు . 100 మీటర్స్,200 మీటర్స్,400 మీటర్స్ పరుగు పందం పోటీలలో భారత దేశం తరపున నిలబడి పథకాల సాధిస్తానని చెప్పారు . గతంలో 2017లో చైనాలో జరిగిన వెట్రన్ అథ్లెటిక్స్ పోటీలలో పథకాల సాధించడం జరిగిందని, అదే విధంగా 2019లో మనీషా లో జరిగిన పోటీలలో బంగారు పదకం సాధించడం జరిగిందన్నారు. గతంలో ప్రపంచ స్థాయిలో జరిగిన వెట్రన్ అథ్లెటిక్స్ పోటీలకు దాతల సహకరించడం జరిగిందని, అదే విధంగా ఈ పోటీలకు వెళ్లేందుకు కొంతమంది దాతలు, సిటీ ఫెలోషిప్ పాస్టర్ సహకరించడం జరిగిందన్నారు. థాయిలాండ్ వెళ్లేందుకు డబ్బుల అవసరమని, దాతలు ముందుకొచ్చి 7995354533 ఫోన్ పే నెంబర్ కు సహాయం అందించగలరని కోరారు. తనకు చిన్నప్పటినుండి క్రీడలు అంటే ఇష్టమని ,వెట్రన్ అథ్లెటిక్స్ పోటీలలో దేశానికి ఎన్నో పథకాలు సాధించడం జరిగిందన్నారు. తనను మరింత ప్రోత్సహిస్తే మరిన్ని పథకాల సాధిస్తానని అయన ధీమా వ్యక్తం చేశారు.

## రూ.12కోట్లతో వాడపల్లిలో శ్రీనివాసం బిల్డింగ్

# 54 గదుల డార్మెటరీలకు శంకుస్థాపన

### రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,



**కొత్తపేట (మనసులో మాట) ఏప్రిల్ 12..** కోనసీమ తిరుమల వాడపల్లి లో శ్రీనివాసం నిర్మాణ నికి శంకుస్థాపన.

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆత్రేయపురం మండలం, వాడపల్లి గ్రామం లో వేంచేసి యున్న శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో శ్రీనివాసా పార్కింగ్ నందు రూ.12 కోట్లతో 54 గదుల డార్మెటరీ తలపెట్టిన శ్రీనివాసం బిల్డింగ్, డార్మటరీల నిర్మాణానికి గౌరవ దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. కొత్తపేట నియోజకవర్గ శాసనసభ్యుడు బండారు సత్యానందరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా నాయకులు, అధికారులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాదాయ, శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి శంకుస్థాపన, శిలాఫలక ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ ,ఆర్ జె సి త్రినాధరావు, కొత్తపేట జనసేన పార్టీ ఇంచార్జ్ బండారు శ్రీనివాసరావు, ఆకుల రామకృష్ణ, పాలూరు సత్యానందం పాలకమండలి చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటి కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, ఆంధ్ర ప్రదేశ్ దేవాదాయ శాఖ సి చంద్రశేఖర్ బాబు, డీఈవో సత్యనారాయణ, ఆలయ పాలక మండలి సభ్యులు, పాల్గొన్నారు

ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.

రాబోయే గోదావరి పుష్కరాలకు తరలివచ్చే లక్షలాదిమంది భక్తులకు గోదావరి పుష్కరాల్లో ప్రత్యేక అనుభూతి, దైవదర్శనం ఉండాలని ఉద్దేశంతో పురాతనమైన ఆలయాలను అభివృద్ధి చేయాలని సంకల్పించినట్లు తెలిపారు. వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శ్రీనివాసం బిల్డింగ్ నిర్మాణానికి రూ.12 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. మందపల్లి మందేశ్వర స్వామి ఆలయంలో తైలాభిషేకం మండపం, అన్నదాన భవనం నిర్మాణానికి రూ.4.2 కోట్ల ను మంజూరు చేసామన్నారు. మురుమళ్ళ వీరేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.4 కోట్లను మంజూరు,. కుండలేశ్వరంలో అన్నదానం భవన నిర్మాణానికి రూ.2.5 కోట్లను మంజూరు చేసామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హిందూ సనాతన ధర్మానికి అనుగుణంగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆశీస్సులతో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టామన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఇప్పటికే దూపదీప నైవేద్యాలు కింద 202 ఆలయాలకు మంజూరు చేసి ప్రతినెల రూ.10,000 ఆలయాల అర్చకులకి బ్యాంక్ అకౌంట్ లో జమ చేస్తున్నామన్నారు. కామన్ గుడ్ ఫండ్ కమిటీ కింద రూ.25.40 లక్షల పనులతో 24 పనులు మంజూరు చేశామన్నారు. గోదావరి పుష్కరాల పరిధిలో ఉన్నటువంటి ఆలయాలన్నింటిని అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు. ఏ వాడలో, ఏ ప్రాంతంలో ఆలయాలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారో వాటన్నిటికీ కావాల్సినటువంటి 5000 భజన మందిరాలను మంజూరు చేసినట్లు తెలిపారు, శ్రీవాణి ట్రస్టు కింద రూ.9.10 కోట్లతో కోనసీమ జిల్లాలో 66 భజన మందిరాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కెవి సత్యనారాయణ రెడ్డి, కొత్తపేట మార్కెట్ యార్డ్ చైర్మన్, పల్లి మంగాదేవి భీమారావు, చిలువూరు సతీష్ రాజు, కూసంపూడి రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లా అభివృద్ధికి చేయూత నివ్వండి

- సీఎం చంద్రబాబు నాయుడుకి కాకినాడ ఎంపీ ఉదయ్ విజ్ఞప్తి
- ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పనితీరుపై చంద్రబాబు ప్రశంసలు



**కాకినాడ (మనసులో మాట) ఏప్రిల్ 12** కాకినాడ జిల్లా అభివృద్ధికి చేయూత నివ్వాలని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. జిల్లా అభివృద్ధిపై శనివారం అమరావతిలో ఎంపీ, మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్ష సమావేశంలో భాగంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యి జిల్లా అభివృద్ధిపై చర్చించి, చేయూత నివ్వాలని విజ్ఞప్తి చేశారు. కాకినాడలో ఆయుర్వేద హాస్పిటల్ కు అనుబంధంగా ప్రభుత్వం మంజూరు చేసిన ఆయుర్వేద కళాశాల కు త్వరితగతిన అనువైన స్థలాన్ని కేటాయించాలని, అలాగే కాకినాడలో రంగరాయ వైద్య కళాశాల ఆవరణలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్ నిర్మాణం, ఉప్పాడ లో నిర్మాణంలో ఉన్న హోటల్ మేనేజ్మెంట్ ఇనిస్టిట్యూట్ కు, కాకినాడ బీచ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు, దీంతో పాటు తుని పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తొలగించేందుకు రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణం, పెద్దమల్లపురం కేంద్రంగా నూతన ఐటీడీఏ ఏర్పాటుకు సహకరించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు. దీంతోపాటు కాకినాడ జిల్లాలో ముఖ్యమైన పలు రహదారుల నిర్మాణం, పీహెచ్ సి, యూపీ హెచ్ సి, అంగన్వాడి కేంద్రాలు ఏర్పాటు, జిల్లాలో హైవేలపై రోడ్డు ప్రమాదాల నివారణకు మూడు ట్రామా మా కేర్ సెంటర్ లు ఏర్పాటుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి జిల్లా అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ పనితీరు పై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసలు కురిపించారు. నిత్యం నియోజకవర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండడంతో పాటు , ప్రజల నుండి వచ్చే అర్జీలు పరిష్కారానికి చూపిస్తున్న చొరవ అభినందనీయ మన్నారు, ఇదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరింత చురుగ్గా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో కాకినాడ జిల్లా ఎంపీ ఉదయ్ తో పాటు జిల్లా లో ఉన్నా ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు.



## అగ్నిప్రమాద బాధితులకు జనసేన రెవెన్యూ అధికారుల అండ..

**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 12:** స్థానిక విరవాడ రోడ్డులోని గంగా నగరంలో శుక్రవారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన దారా మల్లేశ్వరరావు కుటుంబానికి ఆదివారం పలువురు అండగా నిలిచారు. తాటాకు పాక పూర్తిగా దగ్ధమై సామాగ్రి అంతా బుగ్గిపాలవడంతో నిరాశ్రయులైన ఆ కుటుంబానికి జనసేన నాయకులు 50 కేజీల బియ్యం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు.
విషయం తెలుసుకున్న మండల రెవెన్యూ అధికారి గోపాలకృష్ణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ సంఘటనా స్థలాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. ప్రభుత్వం తరపున ప్రాథమిక సహాయంతో పాటు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అందించిన నిత్యావసరాల కిట్‌ను బాధితులకు అందజేశారు. ప్రభుత్వం నుండి పూర్తిస్థాయి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు బాధితులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు పాల్గొన్నారు.

## వైద్య ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలి




**అనపర్తి ( మనసులో మాట)ఏప్రిల్ 12:** ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చివరి రోజు అయిన నాలుగవ రోజు, అనపర్తి మండలం అనపర్తి ఏరియా హాస్పిటల్ లో వైద్య ఉద్యోగులు తమ డిమాండ్ల పరిష్కరించాలని వెంటనే పిఆర్సి కమిటీ వేయాలని ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ 35 రోజుల సాధారణ సెలవులు అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు 100% గ్రాస్ శాలరీ వర్తింపజేయాలని, రెగ్యులర్ చేయాలని తమ నిరసనను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్సస్ కౌన్సిలర్ చైతన్య రాజు, రేడియోగ్రాఫర్ విజయకుమార్, ల్యాబ్ టెక్నీషియన్ క్రాంతి, ఫార్మసిస్ట్ మీనా ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సూర్య పీఠం ట్రస్టుకు శృంగవరపు దంపతులు పదివేలు విరాళం



**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 12 :** మండల కేంద్రం :గోకవరం గ్రామానికి చెందిన శృంగవరపు రవిబాబు సత్యవేణి దంపతులు రూ 10,116/ విరాళాన్ని సూర్య పీఠం ట్రస్టు సభ్యురాలు గంటా రఘుపతికి అందించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ఫౌండర్ ట్రష్టి తోట సాయిబాబు మాట్లాడుతూ సుప్రసిద్ధ ఆధ్యాత్మిక చైతన్య వేదిక, కాషాయ కాంతుల ప్రసరణ జ్వాలిక అయిన సూర్య పీఠం యొక్క నిర్విరామ కృషిని గుర్తించిన ప్రజలు సూర్య పీఠానికి యధాశక్తి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారని అన్నారు. ట్రస్ట్ సభ్యుడు దోసపాటి సుబ్బారావు ప్రోద్భలంతో ఈ విరాళం వచ్చిందన్నారు

# ఎన్‌హెచ్ 165 పై అపోహలు వద్దు..

## త్వరలో పనులు ప్రారంభించి మూడేళ్లలో పూర్తి చేస్తాం

**- 15 రోజుల్లో తాడేపల్లిగూడెంలో వందే భారత్ హాల్ట్ పై అధికారిక ప్రకటన**
**- కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ వెల్లడి**

**భీమవరం, (మనసులో మాట) ఏప్రిల్ 12 :** గత రెండు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎన్‌హెచ్ 165 నిర్మాణ పనులను అతి త్వరలోనే ప్రారంభించి మూడేళ్లలో పూర్తి చేస్తామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రకటించారు. ఆదివారం భీమవరంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. చీఎ 165 రహదారి నిర్మాణంపై కొందరు ప్రజల్లో అనవసర అపోహలు సృష్టిస్తున్నారని, వాటిని నమ్మవద్దని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ కోరారు. ఇటీవల విజయవాడ లో జరిగిన సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ స్వయంగా తన విజ్ఞప్తితో 2400 కోట్ల రూపాయలతో ఎన్‌హెచ్ 165 నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కొన్ని సాంకేతిక సమస్యల వల్ల కొంత ఆలస్యమైందని అన్నారు. ఇటీవల రీ-సర్వే నిర్వహించాల్సి వచ్చిందని, దీనివల్ల అలైన్‌మెంట్‌లో చిన్న మార్పులు, నిర్మాణ వ్యయంలో స్వల్ప పెరుగుదలతో కేంద్ర క్యాబినెట్ అనుమతి తో పనులను త్వరలోనే ప్రారంభిస్తామని అన్నారు. ఎన్ హెచ్ 165 లో భాగంగా భీమవరం బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యి పట్టణ ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం



లభిస్తుందని పేర్కొన్నారు.

**వందే భారత్ హాల్ట్ & రైల్వే అభివృద్ధి:**

తాడేపల్లిగూడెం వాసుల చిరకాల కోరికైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ హాల్ట్ అంశాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, మరో 15 రోజుల్లో దీనిపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉందని శ్రీనివాస వర్మ వెల్లడించారు. జిల్లాలో రైల్వే సర్వీసుల విస్తరణలో తాము సాధించిన పురోగతిని వివరిస్తూ, గతంలో స్పెషల్ ట్రైన్లుగా ఉన్న 9 రైళ్లను ఇప్పుడు రెగ్యులర్ సర్వీసులుగా మార్చినట్లు ప్రకటించారు. ఈ తొమ్మిది రైళ్లు రెగ్యులర్ కావడం వల్ల జిల్లా ప్రజలకు రవాణా పరంగా ఎంతో ప్రయోజనం కలుగుతుందని మంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. రెగ్యులర్ అయిన ఆ తొమ్మిది రైళ్ల వివరాలను మంత్రి వెల్లడించారు. సికింద్రాబాద్ - అనకాపల్లి (17043/44) మరియు చర్లపల్లి - భువనేశ్వర్ న్యూ ఎక్స్‌ప్రెస్ (17067/68) రైళ్లు ఆకివీడు, భీమవరం టౌన్, తణుకు స్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. అలాగే చర్లపల్లి - అనకాపల్లి (17045/46), చర్లపల్లి - అనకాపల్లి (17053/54) మరియు కాకినాడ టౌన్ - హిసార్ ఎక్స్‌ప్రెస్ (17295/96) రైళ్లు తాడేపల్లిగూడెంలో నిలుపుదల సౌకర్యం కలిగి ఉన్నాయన్నారు. నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల ప్రయాణికుల కోసం తిరుపతి - నరసాపురం (17427/28) రైలు ఆకివీడు, భీమవరం టౌన్, భీమవరం, పాలకొల్లు, నరసాపురం స్టేషన్లలో ఆగుతుందని పేర్కొన్నారు. కాకినాడ టౌన్ - లింగంపల్లి (12775/76) మరియు కాకినాడ టౌన్ - మైసూర్ ఎక్స్‌ప్రెస్ (17289/90) రైళ్లు తణుకు, భీమవరం టౌన్, ఆకివీడులలో నిలుస్తాయని తెలిపారు. అదేవిధంగా చర్లపల్లి - నరసాపురం ఎక్స్‌ప్రెస్ (17061/62) రైలు ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు మరియు నరసాపురం స్టేషన్లలో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుందని మంత్రి శ్రీనివాస వర్మ వివరించారు.

## డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్న కూటమి నాయకులు

**తుని, (మనసులో మాట) ఏప్రియల్ 12..** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 135 వ జయంతి వేడుకలు అత్యంత అట్టహాసం నిర్వహించాలని తుని కూటమి నిర్ణయించింది. ఈవేడుకల నిర్వహణ బాధ్యతలు కూటమి దళిత నేతలు భుజాన వేసుకున్నా,రు. మాజీ ఆర్థిక మంత్రి యనమల రామకృష్ణుడు ఆదేశాలు మేరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలకు ప్రభుత్వ విఫ్ యనమల దివ్య విచ్చేసి భారత రాజ్యాంగ నిర్మాత కు ఘన నివాళి అర్పిస్తారని దళిత నేతలు కూటమి కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. తుని పట్టణ నడిబొడ్డున గొల్ల అప్పారావు సెంటర్ లో ఏప్రిల్ 14న కూటమి నేతల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించతలపెట్టిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ 135వ




జయంతి వేడుకలను విజయవంతం చేయాలని పలువురు దళిత నేతలు పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య నిర్ణయించారన్నారు. గొల్ల అప్పారావు సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే యనమల దివ్య ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించడంతో పాటు, కేక్ కటింగ్, భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరగనున్నట్లు చెప్పారు. కావున నియోజకవర్గంలోని ఆయా గ్రామాల ప్రజలు, అంబేద్కర్ అభిమానులు ఉదయం 10 గంటలకల్లా స్థానికంగా అంబేద్కర్ జయంతి వేడుకలను ముగించుకొని గొల్ల అప్పారావు సెంటర్ కు చేరుకోవాలని కోరారు. ఆ రోజు జరిగే జయంతి వేడుకల్లో ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో లంక సునీల్, బోడపాటి శ్రీను, బోడపాటి అప్పారావు, సిద్ధాంతపు సత్తిబాబు, తాటిక సురేష్, దేగల నాగార్జున, ఆరుగుల నూకరాజు, ఆరుగుల కృష్ణ, గూటాల అప్పారావు, బోడపాటి కిరణ్, నిడిగశీట్ల ఆనంద్ కుమార్, దిబ్బ గోవిందు, నొక్కు సోమరాజు,తాటిక నాని,కాపారపు చిన్ని,దేగల నాగార్జున, బంగారు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## యనమలకు పలువురు ప్రముఖుల పరామర్శ

**తుని (మనసులో మాట) ఏప్రియల్ 12.** మాజీ ఆర్థిక మంత్రి తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు.డాక్టర్ సోమరాజు సూచన మేరకు రాజీవ్ మీనన్ యనమలకు శస్త్ర చికిత్స చేసి స్టంట్ అమర్చారు.ఇవాళ మరో మారు వైద్యనిపుణులు పూర్తి స్థాయిలో వైద్య పరీక్షలు అనంతరం యనమలను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు.మరో వైపు రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు యనమలను ఫోన్ లో పరామర్శించారు.శాసన మండలి చైర్మెన్ మోషేష్ రాజు, యనమలకు ఫోన్ చేసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.యనమల తొందరగా కొలుకోవాలని శాసన మండలి చైర్మన్ ఆకాంక్ష వ్యక్తం చేశారు.యనమల నివాసానికి వెళ్ళిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్,రాజ్యసభ సభ్యుడు సానా సతీష్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తదితర ప్రముఖులు యనమలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర్రావు, ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్ ఎన్వీఎస్ఎన్ వర్మ, కాకినాడ రూరల్ మాజీ ఎమ్మెల్యే పిల్లి సత్యనారాయణ తదితరులు యనమలకు ఫోన్ చేసి ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.



# మహిళలకు శుభవార్త

## - రెండు మూడు రోజుల్లో పార్లమెంటు ముందుకు మహిళా రిజర్వేషన్ బిల్లు

## - భారతదేశ మహిళల తరపున ప్రధానికి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ పురంధేశ్వరి



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** మహిళా మూర్తులకు ప్రధాని మోదీ ఇచ్చిన మాట ప్రకారం 33 శాతం రిజర్వేషన్ బిల్లు రెండు మూడు రోజుల్లో పార్లిమెంట్ ముందుకు రానుందని రాజమహేంద్రవరం ఎంపీ డీ పురంధేశ్వరి తెలిపారు. ఇది మహిళలకు గొప్ప శుభవార్త అన్నారు. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లు పార్లమెంట్‌లో ఓటింగ్ కు వస్తున్న తరుణంలో బీజేపీ తూర్పు గోదావరి జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో ఎంపీ పురందేశ్వరి మీడియాతో మాట్లాడుతూ.. మహిళా బిల్లు గురించి ప్రస్తావించారు. నారీ శక్తి యొక్క ప్రాముఖ్యత గురించి, మహిళా సాధికారత గురించి 33 శాతం రిజిస్ట్రేషన్ బిల్లు యొక్క ఆవశ్యకత గురించి ఎంపీ పురంధేశ్వరి సమగ్రంగా వివరించారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో కూటమి సభ్యులు, కూటమి పదాధికారులతో కలిసి ఈ పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ..ఈ బిల్లు మహిళల చిరకాల వాంఛ, దశాబ్దాల కోరిక అన్నారు. భారతదేశ మహిళల తరుపున ప్రధాని మోదీకి ఈ సందర్భంగా ఎంపీ ధన్యవాదాలు తెలిపారు. మహిళా సాధారికత కోసం బీజేపీ పనిచేస్తుందన్నారు.

మహిళలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపించే విధంగా ప్రధాని మోదీ పనిచేస్తున్నారని అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు అధికంగా ఉన్న దేశంలో ఆడపిల్ల లక్ష్మీ దేవి గా పరిగణించే విధంగా సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రధాని మోదీ ప్రవేశపెట్టారని తెలిపారు. గతంలో 1000 మంది పురుషులకు 824 మహిళలు ఉండగా..ఇప్పుడు ఆ మహిళల సంఖ్య 1024 కి చేరిందని చెప్పారు. గర్భిణీలు ప్రభుత్వ ఆస్పత్రిలో రిజిస్టర్ చేసుకుంటే 7 కోట్ల మహిళలు వైద్యం అందిస్తున్నారని, గర్భిణీలకు పౌష్టికాహారం అందించే మాతృత్వ బంధన్ పథకం అన్నారు. ఏడు ప్రాణాంతకమైన జబ్బులతో శిశువులు మరణించే అవకాశం ఉందని, 'ఇంద్ర ధనుష్ పథకం' ద్వారా పుట్టిన బిడ్డలను కాపాడుకుంటున్నామని ఎంపీ చెప్పారు. ఆడపిల్లలు చదువుకు కస్తూరి భాయ్ విద్యాలయాలు ద్వారా విద్య అందించటం, ఆర్థిక సాధకారిత అందించడం.. జన ధన యోజన ద్వారా 52 కోట్లు అకౌంట్ తెరిచారని తెలిపారు. అకౌంట్ తెరిచిన మహిళలకు ప్రమాదం జరిగితే 30 వేల ఇన్సూరెన్స్ సైతం ఉచితంగా అందిస్తుందని, ముద్ర యోజన ద్వారా 10 నుండి 20 లక్షల బ్యాంకులు ఎటువంటి పూచీకత్తు లేకుండా లోన్ మంజూరు చేస్తున్నాయని తెలిపారు.

దేశ వ్యాప్తంగా 12 వేలు మరుగుదొడ్లు నిర్మాణం, స్టాండ్ అప్ ఇండియా ద్వారా 83 శాతం మహిళలు లాభ పడ్డారన్నారు. 10 కోట్ల మంది మహిళలు 90 లక్షల సెల్ఫ్ గ్రూప్ లో ఉన్నారని, ప్రతి మహిళా 2 లక్షల రూపాయలు లోన్ తీసుకునే అవకాశం ఉందన్నారు. లక్పతి దీదీ ద్వారా నైపుణ్యం పెంపొందిస్తూ, పెట్టుబడిదారులుగా ప్రధాని మోదీ 3 కోట్ల మంది మహిళలు లాభ పడ్డారని, 1088 డ్రోన్స్ మహిళలకు సమకూర్చారన్నారు. 9 , 10 శాతం అభివృద్ధి సూచి పెట్టుకున్నామో, మహిళా సాధికారత ద్వారానే సాధ్యం అన్నారు. మహిళలను కలుపుకుని వెళ్తే ఆర్థికంగా, సామాజికపరంగా సమాజం ముందుకు వెళ్తుందని అన్నారు. రాజకీయంగా మహిళలను ముందుకు తీసుకురావడం ముఖ్యమని, 50 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలు ముందుకు వచ్చారని, చట్ట సభల్లో మహిళకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనేది దశాబ్దాల కోరిక అన్నారు.

మహిళా రిజర్వేషన్ ప్రవేశపెడుతూనే.. ఎస్సీ ఎస్టీ రెప్రజెంటేషన్ ఉంటుందని చెప్పారు. లోక్‌సభలో 15, రాజ్య సభలో 14 శాతం మహిళలు ఉన్నారని, మహిళ అన్ని కోణాలు నుండి ఆలోచించే శక్తి కలది కాబట్టే ఈ బిల్లు ప్రవేశపెడుతున్నారని ఎంపీ పురంధేశ్వరి చెప్పుకొచ్చారు.

ప్రధాని మోదీ ధైర్య, సాహసాలతో లోక్ సభ లో బిల్లు ప్రవేశపెట్టారని, మహిళా రిజర్వేషన్ కల్పించడం అంటే అది దేశాభివృద్ధికి దోహద పడటమే అన్నారు. పాత్రికేయులు అడిగిన సందేహాలకు విపులంగా ఎంపీ సమాధానాలిచ్చారు.

సమావేశంలో తూర్పు గోదావరి జిల్లా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కీ నాగేంద్ర, మహిళా మోర్చా అధ్యక్షురాలు శ్రీవిద్య పాలడుగుల, సీనియర్ నాయకురాలు రేలంగి శ్రీదేవి, రాష్ట్ర మహిళా మోర్చ ఉపాధ్యక్షురాలు తాడిమళ్ల విజయ వాణి, తెలుగుదేశం పార్టీ జిల్లా మాజీ అధ్యక్షురాలు విజయలక్ష్మి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా స్వరూప, గోదావరి జోన్ ఇంచార్జ్ పిడికిట శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సపల్లి హారిక, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిపాటి స్వర్ణ రజిని, జిల్లా వైస్ ప్రెసిడెంట్ పేరేచర్ల సూర్య ప్రభావతి, జిల్లా కార్యదర్శి చిక్కం మోహిని, అలాగే కూటమి నుంచి బీజేపీ మహిళా మార్చా నుంచి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# కుంతి దేవి అమ్మవారి ఆలయ శంకుస్థాపనలో పాల్గొన్న కంబాల

## - ఆలయ నిర్మాణానికి కంబాల రూ 5 లక్షలు విరాళాలనికి హామీ



**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 12 :** దేవిపట్నం మండలం ఫజుల్లాబాద్ గ్రామంలో కుంతి దేవి అమ్మవారి ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ఆదివారం ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. తొలుత కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆయనకు పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఆలయ నిర్మాణానికి కంబాల శ్రీనివాసరావు రూ 5 లక్షలు విరాళం ప్రకటించారు.

**వేపాలమ్మవారి విగ్రహ ప్రతిష్ట లో పాల్గొన్న కంబాల..**

సీతానగరం మండలం తోర్రేడు గ్రామంలో ఆదివారం నిర్వహించిన వేపాలమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆయనకు కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీ కోదండ రామాలయం అన్నసమారాధనలో పాల్గొన్న కంబాల..**

మండల కేంద్రం కోరుకొండ గ్రామంలోని శ్రీ అంకాలమ్మ తల్లి వీధిలోని శ్రీ కోదండ రామాలయం ఆలయం వద్ద నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికి, సత్కరించారు. ఆలయంలో సీతారాముల వారి దర్శించుకుని, పూజలు నిర్వహించారు. అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించి, భక్తులకు వడ్డించారు. అన్నసమారాధన కార్యక్రమానికి 2000 మంది భక్తులకు సరిపడా బియ్యం, కిరాణా సామాన్లు, విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు



# డ్రైవర్స్ కాలనీ లో ప్రత్యేక పారిశుధ్య పనులు..

**పిఠాపురం, మనసులో మాట ఏప్రిల్ 12:** పట్టణంలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శానిటేషన్ పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం 8వ వార్డు డ్రైవర్స్ కాలనీలో జరుగుతున్న పనులను ఆ వార్డు జనసేన పార్టీ ఇంచార్జ్ పల్నాటి మధుబాబు స్వయంగా పర్యవేక్షించారు.

ఉప ముఖ్యమంత్రి పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడమే లక్ష్యంగా ఈ పనులు గత రెండు రోజుల నుండి చేపట్టినట్లు ఆయన తెలిపారు. డ్రైనేజీల్లో పేరుకుపోయిన సిల్టును తొలగించడం, కాలనీల్లో ఎప్పటి నుండో ఉన్న చెత్తాచెదారాన్ని మున్సిపల్ అధికారుల సహకారంతో క్లియర్ చేస్తున్నామని పేర్కొన్నారు. వార్డు ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పారిశుధ్యంపై దృష్టి సారిస్తామని ఈ సందర్భంగా పల్నాటి మధుబాబు వెల్లడించారు.

# ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు



**పిఠాపురం, (మనసులో మాట) ఏప్రిల్ 12:** స్థానిక మెయిన్ రోడ్డులోని ఖాదీ బండారు సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఆటో బోల్తా పడి ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. గొల్లప్రోలు నుండి జగ్గయ్య చెరువు వైపు వెళుతున్న ఆటో, అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయే క్రమంలో నియంత్రణ కోల్పోయి రోడ్డుపై పల్టీ కొట్టిందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో జగ్గయ్య చెరువుకు చెందిన జే. సునకయ్య, జే. చిన్నబాబు, ఎన్. సత్తిబాబులకు గాయాలు కాగా, స్థానికులు వెంటనే వారిని అంబులెన్స్ లో పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నేడు కాకినాడలో చేనేత ఆత్మగౌరవ రిలే దీక్షలు



**మండపేట (మనసులో మాట ) ఏప్రిల్ 12..** ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా చేనేత సహకార సంఘాల జేఏసీ ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ కలెక్టరేట్ వద్ద చేనేత ఆత్మగౌరవ దీక్ష పేరుతో రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నారు. గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఈ దీక్షల ద్వారా డిమాండ్ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత సహకార సంఘాల సభ్యులందరూ అధిక సంఖ్యలో పాల్గొని దీక్షలను విజయవంతం చేయాలని జేఏసీ కో కన్వీనర్ బేత వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు.



## పేదలని ఆదుకోవడం
# మన కనీస కర్తవ్యం

కొత్తపేట (మనసులో మాట) ఏప్రిల్ 12.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన అన్నపూర్ణ శేఖర్ దంపతులు స్థానిక అన్నపూర్ణ డే కేర్ హోమ్ లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు పేద చిన్నారులకు పుస్తకాలను స్టేషనరీ పంపిణీ చేయడంతో పాటు ర్యాలి సందర్శకులకు మజ్జిగ తాటి విసిన కర్రలు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు అన్నదానాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా అన్నపూర్ణ శేఖర్ మాట్లాడుతూ పేదలని ఆదుకోవాల్సిన కనీస బాధ్యత మనందరి పైన ఉందని పేదలకు సేవ చేస్తున్న అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని అన్నారు. అనంతరం అన్నపూర్ణ శేఖర్ దంపతులను శ్యామ్ జాదుగర్ మెగా మ్యాజిక్ ఫ్యామిలీ ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్ మోహిత్ సీత అన్నపూర్ణ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## జీడిపిక్కల కొనుగోళ్లలో గిరిజనులను నిలువుదోపిడీ చేస్తున్న దళారులు

- ఐటీడీఏ తక్షణమే రంగంలోకి దిగాలి
- కలెక్టర్ జోక్యం చేసుకుని మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి
- సిపిఎం పోలవరం జిల్లా కమిటీ డిమాండ్



రంపచోడవరం, మనసులో మాట ఏప్రిల్,12.. ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులు అష్టకష్టాలు పడి పండించిన జీడిపిక్కల పంటను దళారులు విచ్చలవిడిగా దోచుకుంటున్నారని, దీనిపై ఐటీడీఏ అధికారులు, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించాలని సిపిఎం పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ ఏజెన్సీలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో దళారులు సిండికేట్‌గా మారి గిరిజనుల నుంచి అతి తక్కువ ధరకే జీడిపిక్కలను కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ మార్కెట్ ధర కంటే చాలా తక్కువ ఇచ్చి ఆదివాసీల శ్రమను దోచుకుంటున్నారన్నారు. కేవలం ధరలోనే కాకుండా, తూకాల్లో కూడా వ్యాపారస్తులు గిరిజనులను భారీగా వంచిస్తున్నారని కళ్లముందే ఐటీడీఏ జిల్లా కలెక్టరేట్ కూత వేటు దూరంలో మోసం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణము అన్నారు. ఐటీడీఏ, వెలుగు ద్వారా కొనుగోళ్లు చేయాలని గిరిజన రైతులకు న్యాయం జరగాలంటే ఐటీడీఏ మరియు 'వెలుగు' విభాగాల ద్వారా తక్షణమే ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలనీ, రైతులకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధరకు గిరిజనుల వద్ద నుంచి నేరుగా పంటను సేకరించాలన్నారు.దీనివల్ల దళారుల బెడద తప్పుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో వ్యాపారస్తుల అరాచకాలు పెచ్చుమీరిపోతున్నాయి. అమాయక గిరిజనులను తూకాల్లోనూ, ధరలోనూ మోసం చేస్తున్నా యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరికాదు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, ఐటీడీఏ ద్వారా గిరిజన రైతులకు అండగా నిలవాలి. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని సిపిఎం పోలవరం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ కుమార్ హెచ్చరించారు.

# దాతల సహకారం తో ట్రాఫిక్ స్టాపర్ బోర్డులు...

## ట్రాఫిక్ నియంత్రణ కు చర్యలు - రాజమహేంద్రవరం ఈస్ట్ జోన్ డీఎస్పీ విద్య




మండపేట (మనసులో మాట ) ఏప్రిల్ 12.. దాతల సహకారంతో ట్రాఫిక్ స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు రాజమహేంద్రవరం డీఎస్పీ బి విద్య అన్నారు. మండపేట టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద వీటిని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి టౌన్ సి ఐ సురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ విద్య మాట్లాడుతూ మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి లో ట్రాఫిక్ నియంత్రణకు దాతల సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణ కు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. మండపేట టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ బందోబస్తు ఏర్పాట్ల కోసం స్టాపర్ బోర్డులు విరాళంగా అందించారన్నారు. స్నేహ డెవలపర్స్ ఐ ఎస్ ఎన్, బిగ్ సి మొబైల్స్, బి న్యూ మొబైల్స్, శ్రీ కన్వెన్షన్, సూర్యనారాయణ హాస్పిటల్స్, ఇన్ మీ నర్సింగ్ హోమ్ ఫిజియో థెరపీ, రిహాబిలిటేషన్ సెంటర్,రోటరీ క్లబ్, లక్ష్మీ దివ్య చంద్ర రా బాయిల్డ్ రైస్ మిల్, ఎంపీ ఎస్ స్కూల్ జూనియర్ కాలేజ్ వల్లూరి చిన్నారావు, విజ్ఞాన్ కాలేజ్,భాష్యం స్కూల్,విద్యా వికాస్ కాలేజ్, అక్షర స్కూల్, శశి స్కూల్ జూనియర్ కాలేజ్,అన్నపూర్ణ పబ్లిక్ స్కూల్ లు వీటిని అందజేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా దాతలందరికీ పోలీస్ శాఖ తరపున డీఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సహకరించిన అన్ని సంస్థలకు మండపేట పోలీస్ శాఖ ధన్యవాదాలు తెలియజేస్తోందన్నారు. వీటిని ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, అలాగే మండపేట పట్టణ ప్రవేశ ద్వారాల వద్ద ఏర్పాటు చేస్తానని టౌన్ సి ఐ సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమం లో టౌన్ ఎస్ ఐ రాము, ఏ ఎస్ ఐ లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# తాపేశ్వరం సురుచిలో పోలిశెట్టి భూషణం 15వ ఆత్మీయ సంస్మరణ వేడుక



మండపేట (మనసులో మాట) ఏప్రిల్ 12.. తాపేశ్వరం సురుచి ఫుడ్స్ ప్రాంగణంలో సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు మాతృమూర్తి దివంగత పోలిశెట్టి భూషణం 15వ ఆత్మీయ సంస్మరణ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది.ప్రతి సంవత్సరం ఆమె వర్ధంతి సందర్భంగా నిర్వహించే చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా సంప్రదాయబద్ధంగా కొనసాగించారు. ఈ కార్యక్రమానికి పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. మల్లిబాబు, ఆయన సతీమణి భారతి, కుటుంబ సభ్యులు స్వయంగా మహిళలకు చీరలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు తమకు నచ్చిన చీరలను స్వయంగా ఎంచుకునే అవకాశం కల్పించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఎండ తీవ్రత దృష్ట్యా చీరల కోసం వచ్చిన మహిళలకు చల్లని మజ్జిగ, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేసి మల్లిబాబు తమ సేవా భావాన్ని చాటుకున్నారు.

ఈ స్మృతి వేడుకలో సుమారు వెయ్యి చీరలను పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం లో సురుచి పి ఆర్ ఓ ఉప్పలపాటి రామ బద్రి రాజు వర్మ, సురుచి ఫుడ్ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్ లో ఫైనల్‌కు మల్లవరం టీమ్



గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 12 : భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి పురస్కరించుకుని మల్లవరం జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ లో పలు గ్రామాల నుండి టీములు పాల్గొన్నారు. అంబేద్కర్ యూత్ సభ్యుల నిర్వహిస్తున్న పోటీలు ఆసక్తికరంగా మారాయి. గోకవరం మండలం మల్లవరం గ్రామంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ లో మొదటి సెమి ఫైనల్ లో జగ్గంపేట వర్సెస్ మల్లవరం జట్ల మధ్య హోరా హోరీగా జరిగిన మ్యాచ్ లో మల్లవరం సీనియర్ జట్టు విజయం సాధించి ఫైనల్ చేరుకుంది. సోమవారం చెన్నూరు, కామరాజుపేట సెమీఫైనల్లో తలపడనున్నాయి. వీటిలో విజేతలు ఫైనల్ చేరి మల్లవరం టీం తో ఫైనల్ ఆడనున్నాయి. ఈ టీంలో విజేతలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా మంగళవారం యూత్ సభ్యులు, గ్రామ పెద్దలు సమక్షంలో ట్రోఫీని అందజేయనున్నారు

# అక్రమ నిల్వచేసిన బాణాసంచా సీజ్ చేసిన కాకినాడ ఆర్డీఓ ఎస్ మల్లిబాబు



కాకినాడ/పెదపూడి (మనసులో మాట) ఏప్రిల్ 12.. అక్రమ నిల్వ చేసిన బాణాసంచా కాకినాడ ఆర్డిఓ ఎస్. మల్లిబాబు ఆదివారం పెదపూడి మండలం కైకవోలు గ్రామంలో సీజ్ చేశారు.దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదపూడి మండలం కైకవోలు గ్రామానికి చెందిన ఇనపకోళ్ల వీర వెంకట సత్యనారాయణ కి చెందిన డోర్ నెం.1-8, రామాలయం వీధిలో గల ఇంటిని గోపిశెట్టి మణికంఠ స్వామీ అనే వ్యక్తి మందుగుండు సామగ్రి నిల్వ చేయు నిమిత్తం అద్దెకి తీసుకొన్నరని సమాచారం తో ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో కాకినాడ ఆర్డిఓ ఎస్. మల్లిబాబు స్థానిక తహసిల్దారు, ఎస్సైఓల కలిసి ఆకస్మికంగా ఇంటిని తనిఖీ చేసారు. ఈ తనిఖీ సందర్భంగా ఆ ఇంట్లో సుమారు 47 బాక్సుల్లో 5 లక్షల రూపాయలకు పైనే విలువైన 23 రకాలైన మందుగుండు బాణాసంచా సామగ్రిని వారు గుర్తించారు. ఇందులో 5000 వాలా, 62 షాట్స్ పెలుపుడు జువ్వలు తదితర రకాల బణా సంచా ఉంది. అక్రమంగా నిల్వ చేసిన ఈ బాణాసంచాను ఆర్డిఓఎస్ మల్లిబాబు సీజ్ చేసి, కేసు నమోదు చేసారు.



### వెంకన్నదొర దంపతులు చే కృష్ణుని పాలెంలో

# నవగ్రహాల విగ్రహాలస్థాపన

**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 12 :** గోకవరం మండలం కృష్ణునిపాలెం శ్రీ పార్వతి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్థానిక టిడిపి నాయకుడు, వ్యాపారవేత్త బోలగుండ వెంకన్న దొర దంపతుల చేతుల మీదుగా నవగ్రహాల విగ్రహాల స్థాపనకు శ్రీకారం చుట్టారు. ఆదివారం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రతిష్టాపన కార్యక్రమం జరిగినది. ప్రముఖ వాస్తు సిద్ధాంతి సూచనలతో వెంకన్న దొర దుర్గా దేవి దంపతులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకన్న దొర మాట్లాడుతూ శ్రీ పార్వతి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో శివలింగం కాశిలో గంగా నదిలో విశిష్ట పూజలు అందుకొని ఆలయంలో ప్రతిష్టాపన చేయడం జరిగిందన్నారు. శివుని దర్శనం ఎంతో పుణ్యఫలమని, శివయ్య విశేషమైన మహిమలు భక్తులకు నిదర్శనంగా కనబడుతున్నాయన్నారు. కుల మతాలకు అతీతంగా స్వామి వారి కార్యక్రమాలకు ప్రజలందరూ భాగస్వాములు కావడం కృష్ణునిపాలెంలో ఆనవాయితీయని అందుకే ఈ శివాలయానికి భక్తులు రోజు రోజుకి పెరుగుతున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో సిద్ధ చంటి, మండిగ గంగాధర్, బోలగుండ వెంకటేశ్వరరావు, బొలగుండ రాజా రావు, మలిరెడ్డి బుల్లికృష్ణ, గొర్రెపూడి సూర్యప్రకాశరావు (చిన్న), సిద్ధ సురేష్, బోలగుండ ప్రసాద్, గ్రామస్తులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు

# శ్రీవారిని దర్శించుకున్న ఏపి ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

### - ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు



**ఏలూరు, ఏప్రిల్, 12(మనసులో మాట)..** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ద్వారకాతిరుమలలో శ్రీ వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. స్థానిక పర్యటనలో భాగంగా ద్వారకాతిరుమల విచ్చేసిన ప్రెస్ అకాడమీ ఛైర్మెన్ ఆదివారం ఉదయం శ్రీవారి ఆలయానికి విచ్చేసారు. ఆలయ ఈఓ భద్రాజీ, ఆలయ అధికారులతో ఆలయ మర్యాదలతో సురేష్ కుమార్ కు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ వేద పండితులు స్వామివారి అంతరాలయంలో సురేష్ కుమార్ కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదాశీర్వచనం మండపంలో సురేష్ కుమార్ కుటుంబ సబ్యులకు వేద పండితులు వేద ఆశీర్వచనం చేశారు. అనంతరం ఆలయ అధికారులు స్వామి వారి చిత్రపటాన్ని, స్వామి వారి ప్రసాదాన్ని ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ దంపతులకు అందజేశారు.

# దేశం సుభిక్షం కోసం బిజెపి పనిచేస్తుంది

### - ఎమ్మెల్సీ సోము వీర్రాజు



**గండేపల్లి (మనసులో మాట) ఏప్రిల్ 12:** బిజెపి ఆధ్వర్యంలో బి. ఎల్ .ఏ. 2 కార్యశాల గండేపల్లి మండలం రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్ లో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మరియు జగ్గంపేట నియోజకవర్గ ఇన్చార్జ్ దాట్ల కృష్ణ వర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోము మాట్లాడుతూ భారతదేశ సుభిక్షంగా ఉండాలంటే బిజెపి ప్రభుత్వం తప్పనిసరిగా అధికారంలో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. ఓటర్ లిస్ట్ లో దొంగ ఓట్లు తొలగించడం, కొత్తగా ఓట్లను జాయిన్ చేయడం కేంద్ర ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.దీనికి బిజెపి సపోర్ట్ చేస్తూ,సమగ్ర విచారణ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తుంది అన్నారు. ఇప్పటినుండి ఓటర్ లిస్టు ఆధారం చేసుకుని బిజెపి పని చేస్తుందని, భారతదేశంలో అన్ని రాష్ట్రాల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని, ఓటర్ల విషయంలో బిజెపి చాలా పటిష్టంగా పనిచేస్తుందన్నారు. ఇప్పటివరకు 3 లక్షల 75 వేల మందికి ట్రైనింగ్ ఇవ్వడం జరిగింది అన్నారు.మూడు పార్టీలు కలిపి ప్రతి 40, 50 ఓటర్లకు ఇన్చార్జిని నియమించడం జరుగుతుందని,2027 వ సంవత్సరంలోపు పోలవరం పూర్తి చేస్తామని, పోలవరం మూలంగా జగ్గంపేట నుంచి తుని వరకే కాకుండా అటు విశాఖపట్నం శ్రీకాకుళం వరకు పోలవరం నీటిని తీసుకెళ్లి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు.కేంద్ర ప్రభుత్వం ద్వారా స్టీల్ ప్లాంట్ కి 11 వేల కోట్లు ఇవ్వడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరయ్య బూత్ మేనేజ్మెంట్ గురించి వివరించారు. జగ్గంపేట నియోజకవర్గం బిఎల్ఏ వన్ కంబాల శ్రీనివాసరావు బూత్ లెవెల్ ఏజెంట్లకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ ఎనిమిరెడ్డి మాల కొండయ్య, కాకినాడ జిల్లా బిజెపి అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణ వర్మ, జగ్గంపేట నియోజకవర్గం బిఎల్ ఏ 1 కంబాల శ్రీనివాసరావు,జిల్లా బిఎల్ఏ సభ్యులు దువ్వూరు సుబ్రహ్మణ్యం,దాట్ల సూర్యనారాయణ రాజు,బిజెపి గండేపల్లి మండల పార్టీ అధ్యక్షులు తోరాటి వెంకన్న, జగ్గంపేట మండల పార్టీ అధ్యక్షులు పల్లా రమణ,కిర్లంపూడి మండల పార్టీ అధ్యక్షులు శరకం రాజబాబు, భారతీయ జనతా భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




### కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి

# ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

### - నియోజకవర్గ జనసేన పార్టీ



**ప్రత్తిపాడు (మనసులో మాట) ఏప్రిల్ 12..** ప్రత్తిపాడు నియోజక వర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొంతమంది పనికట్టుకొని దుష్ప్రచారం చేస్తున్నారని ప్రత్తిపాడు నియోజకవర్గం జనసేన నాయకులు ఆదివారం ఆరోపించారు. దీనికి సంబందించిన వివరాలు వారి మాటల్లో ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు మండలం మెట్టుచింత ఉలిగోగుల గ్రామలాల్లో రోడ్డులో క్వాలిటీ కంట్రోల్ చెకింగ్ కోసం తీసిన గొయ్యిని చూపించి దుష్ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జనసేన నాయకులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారధ్యంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ ల కృషితో నియోజకవర్గం లో ఇప్పటి వరకు మట్టి రోడ్డు లేని గ్రామాల్లో కూడా బీటీ, సీసీ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. జనసేన నాయకులు సంబంధిత అధికారులు కూడా రోడ్డు నాణ్యతలో లోపం లేదని తెలిపారని వారు పేర్కొన్నారు.ఈ వ్యవహారాన్ని సోషల్ మీడియా కొంతమంది నాయకులు సహకారం తో దుష్ప్రచారాలు చేసినా కూటమి ప్రభుత్వంలో ఎమ్మెల్యే సత్యప్రభ సారధ్యంలో అభివృద్ధి జరుగుతూనే ఉంటుందని తెలియ చేసారు. జనసేన నాయకులు మీడియా సమావేశంలో మాట్లాడిన వారు ధర్మవరం,లింగంపర్తి సొసైటీల అధ్యక్షులు దాసం శేషారావు, పెంటకోట మోహన్ శంఖవరం,ప్రత్తిపాడు మండలాల జనసేన అధ్యక్షులు గాబు సుభాష్, రామకుర్తి కామేష్ ఉన్నారు.



## శుభకార్యాలలో పాల్గొన్న మంత్రి కందుల

**నిడదవోలు మనసులో మాట ఏప్రియల్ 12..** నిడదవోలు నియోజకవర్గం లో ఉండ్రాజవరం మండలం పాలంగి గ్రామం శ్రీ సాయి ఫంక్షన్ హాల్ నందు శౌంఠన లక్ష్మణ నారాయణ కుమారుడి వివాహ వేడుకలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. నియోజవర్గంలో పెరవలి మండలం తీపర్రు ఇంకా పలు కార్యక్రమంలో మంత్రి కందుల పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, తదితరులు ఆయనతో పాల్గొన్నారు.

## వంకా రవీంద్రనాథ్ ను పరామర్శించిన నిడదవోలు మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు



**నిడదవోలు (మనసులో మాట) ఏప్రియల్ 13..** ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాతృమూర్తి వంకా నాగమణి ఇటీవల మరణించిన విషయం తెలిసినదే. ఈ సందర్భంగా నిడదవోలు మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు రవీంద్రనాథ్ ను పరామర్శించారు. అలాగే పెరవలి మండలం ఉసులుమర్రుకు చెందిన కె.ఏడుకొండలు కుమారుడు రోడ్ ప్రమాదం లో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ నేతలు సర్పంచ్లు పలువురు పాల్గొన్న వారిలో ఉన్నారు.

## రేపు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి కి ప్రత్యేక శానిటేషన్ నిర్వహించాలి

### - దళిత నాయకుడు బత్తిన రామకృష్ణ



**గోకవరం (మనసులో మాట), ఏప్రిల్ 12 :** డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ 135 వ జయంతి సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలు కమ్యూనిటీ హాల్ వద్ద పంచాయతీ అధికారులు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా శానిటేషన్ చర్యలు చేపట్టాలని దళిత నాయకుడు బత్తిన రామకృష్ణ అధికారులను కోరారు. ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా పంచాయతీ ప్రత్యేక అధికారులు పాలన దృష్టిలో పెట్టుకుని ఆయా పంచాయతీలలో, కుడళ్ళలో ఉన్న అంబేద్కర్ విగ్రహాలు, అంబెద్కర్ కమ్యూనిటీ హాల్ దగ్గర ప్రత్యేక సానిటేషన్ కార్యక్రమాన్ని చేపట్టి జయంతి ఉత్సవాలకు సహకరించాలని ఆయన కోరారు. అదేవిధంగా ప్రతి పంచాయతీలోనూ ప్రత్యేక అధికారుల అధ్యక్షత న అంబేద్కర్ జయంతి నిర్వహించాలని ఆయన కోరారు.

# పోలీసు శాఖకు ఆణిముత్యం హెచ్సీ రేవతి

- సుమోటో గా దర్యాప్తునకు ఆదేశించిన మదురై కోర్టు తీర్పును యావత్ భారతీయులు మానవత్వంతో స్వాగతిస్తున్నారు..
- మానవ హక్కులకు భద్రత లేకపోయినా..న్యాయం అందుబాటులో లేకపోయినా మానవ ఉగ్రవాదం పెరిగిపోయే ప్రమాదం వుంది
- పౌరుల ఆత్మగౌరవానికి, స్వేచ్ఛకు ప్రభుత్వం భరోసాగా నిలవాలి ..
- ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** మదురై కోర్టు వంటి విచారణ ఆంధ్రప్రదేశ్ లో గల ఒక జిల్లాలో చేపడితే ఉరిశిక్ష పడే అవకాశాలు మెండుగా ఉంటాయని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (ఆర్పీసీ) ప్రధాన కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ వారాంతపు సమావేశంలో ఆర్పీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

పోలీసు శాఖలో ఉన్నత అధికారులు తీరు ఒక లాగా, దిగువ స్థాయి పోలీసు ఉద్యోగులు తీరు మరో లాగా ఉంటాయని, తమిళనాడు మదురై కోర్టు సంచలన ఉరి శిక్ష తీర్పులో హెడ్ కానిస్టేబుల్ " రేవతి " సాక్ష్యం పోలీసు శాఖకే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆమె ఖాకీ యూనిఫామ్ కే వన్నె తెచ్చే విధంగా ఒత్తిడులకు తలొగ్గకుండా, బెదరకుండా న్యాయ స్థానానికి సహకరిస్తు జరిగిన నేరానికి సంబంధించి స్పష్టంగా సాక్ష్యం చెప్పి పోలీసు ప్రతిష్ఠను పెంచారని కొనియాడారు. ప్రజల హృదయాలను గెలుచుకున్నారన్నారు. పోలీసు శాఖలో నేడు అత్యధిక శాతం ఎందుకు విధులు నిర్వహిస్తున్నారో తెలియకుండానే లంచాలు, అధికార దుర్వినియోగ విధులకు బానిసలుగా మారిపోయారన్నారు. చట్టబద్ధమైన విధులు నిర్వహించే పోలీసులు నేడు కానరావటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి పోలీసులు పౌరుల పట్ల ఎందుకు కర్కశంగా వుంటారో ఆలోచించుకుంటే వారికే అర్థం కాని ప్రశ్న వారిని వెంటాడుతుందన్నారు. కొన్ని ఘటనల్లో పోలీసు చేసే పాపాలు, మోసాలు మానవత్వాన్ని గుచ్చి గుచ్చి వేధించే రాబందుల జీవితాలు వలే మారుతుంటాయన్నారు. పోలీసు ఉన్నతాధికారికి దిగువ స్థాయి పోలీసు అంటే ఎంతో చులకన భావమని, దిగువ స్థాయి పోలీసుకు బాధితులు అంటే చులకన భావమన్నారు. బాధితులు, నేరస్తుల నుండి లంచాలు గుంజటం దిగువ స్థాయి పోలీసు విధులుగా వుంటే.. దిగువ స్థాయి పోలీసును బెదిరించి దోచుకోవడం అధికారిక పోలీసు విధులు అన్నట్టు ప్రస్తుత పోలీసు డ్యూటీలు సమాజం నుండి అపకీర్తిని సొంతం చేసుకుంటున్నారని మేడా శ్రీనివాస్ వ్యాఖ్యానించారు.

ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నత అధికారుల ఒత్తిడిలకు, వేధింపులకు లొంగకుండా కళ్ళముందు జరిగిన దారుణాన్ని న్యాయ స్థానానికి తెలియజేసిన హెడ్ కానిస్టేబుల్ రేవతి యావత్ భారతదేశ ప్రజల హృదయాలను గెలుచుకున్నారని అన్నారు. పోలీసులు అందరూ ఒకలా వుండరని, రేవతి పోలీసు మానవత్వాన్ని గెలుచుకుందని.. ఆమె నిజాయితీని, ధైర్యాన్ని మేడా కొనియాడారు.

తమిళనాడు సాత్తాన్ కుళం పోలీసు స్టేషన్ లో తండ్రి, కొడుకులను అమానుషంగా కొట్టి వారి చావుకు కారణం అయ్యిన 9 మంది పోలీసులకు మదురై కోర్టు మరణ శిక్షను ఖరారు చేయటం పట్ల అర్ధ శతాబ్దం పైబడిన తరువాత భారతదేశ ప్రజాస్వామ్యంలో కొంత మేరకు రాజ్యాంగం, న్యాయం కూడా బ్రతికే వుంది అని పౌరుల్లో కాస్తంత ఆశ కల్పించిన మదురై కోర్టుకు ప్రజలు అభినందనలు వెలువెత్తుతున్నారని చెప్పారు. ఈ కేసు నేరంలో వున్న పోలీసులు సాక్ష్యాలను తుడిచి వేసినా, తారు మారు చేసినా అదే పోలీసు స్టేషన్ లో ఆ సమయంలో ఉన్నటువంటి హెడ్ కానిస్టేబుల్ "రేవతి" మానవత్వం, విధుల్లో ఉన్నటువంటి నిబద్ధత ఈ కేసులో మరణశిక్ష విధింపబడే విధంగా తీర్పు వెలువడిందన్నారు. పోలీసులు వ్యక్తిగత అహంకారాన్ని విడిచి డ్యూటీ ని డ్యూటీ లాగ చేస్తే ప్రజల ఆశీస్సులతో పాటుగా వారి సొంత కుటుంబ సభ్యుల అభిమానాలను, ఆనందాలను కూడా పొందుతారని వారు గ్రహించలేక పోతున్నారన్నారు. ప్రతి పోలీసు అధికారి ఈ చిన్న లాజిక్కును నిత్యం విస్మరిస్తూనే పోలీసు విధులకు బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్కువ శాతం పోలీసులతో నేరాలు చేయించేది పాలకులు..

ఆ అధికార దుర్వినియోగ నేరాలను అమలు చేయించేది మాత్రం కొంతమంది అధికారులు, ఉన్నత అధికారులు అనేది నిజం అన్నారు. కానీ ఆ నేరాలను చేసేది, అమలు చేసేది, ఆచరించేది దిగువ స్థాయి సిబ్బందని, అధికారులు అనేది జగమెరిగిన యదార్థం కాదా ..అని ఆయన ప్రశ్నించారు.

చట్టం, న్యాయం సజావుగా అమలు జరిగిన వేళ సామాజిక భద్రత సమాజానికి వుంటుందన్నారు. పోలీసు శాఖ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన గౌరవ ప్రథమైన లక్ష్యంతో ఆవిర్భవించిందన్నారు.

కాల క్రమంగా కొంతమంది అవినీతి పరుల విధులు ఆ శాఖకు మకిలి పట్టిస్తున్నాయని, నేడు ఈ అవినీతికి అధికార దుర్వినియోగం తోడై పౌర హక్కులను, మానవ హక్కులను కాలరాస్తున్నారన్నారు. బాధ్యత గల పోలీసు విధులు నిర్వహించడం మరిచిపోయి అహంకారంతో పోలీసు విధులకు బానిసలుగా మారి పోతున్నారన్నారు. ప్రస్తుతం పోలీసు స్టేషన్లకు బాధితులు వెళ్ళటానికి భయపడుతున్నారని, నేరస్టులే స్వేచ్ఛగా పోలీసు స్టేషన్స్ కు వెళ్లి పోలీసులతో బాధితులను బెదిరిస్తుండటం ప్రస్తుత పోలీసు విధులుగా వుంటున్నాయన్నారు. పోలీసులు అహంకారంతో ఆలోచించలేని తెలియని విషయం ఏమిటంటే.. సరైన జడ్జి, పోలీసు ఉన్నత అధికారి, రేవతి వంటి హెడ్ కానిస్టేబుల్ దృష్టి సారిస్తే జైళ్ళకు వెళ్ళక తప్పటం లేదన్నారు. చట్టం ఏమి చేయలేదు అనే మితిమీరిన విశ్వాసంతో అధిక శాతం పోలీసులు నేరాలను వ్యాపారంగా మార్చుకుంటున్నారని మేడా వ్యాఖ్యానించారు. పౌరులు ప్రశ్నించే తత్వాన్ని పోలీసులు తట్టుకోలేకపోతున్నారని, పోలీసు విధులను చట్టబద్ధంగా కాకుండా అహంకార పూరితంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. తద్వారా పోలీసులు న్యాయ స్థానం శిక్షలకు గురికాక తప్పటం లేదని అన్నారు. పౌరులు నష్టపోక తప్పటం లేదని, చట్ట బద్ధమైన విధులు నిర్వహిస్తే పోలీస్ కు ప్రతిష్ఠ పెరుగుతుందన్నారు. నిత్యం మన శ్శాంతి దక్కుతుందనే నిజాన్ని గ్రహించలేని పోలీసు విధులు ఎవరి కోసమో ఆలోచించుకో.. పోలీసు మిత్రమా అని ఆయన సూచించారు.

పౌరుల భద్రతకు, ఆత్మ గౌరవానికి, స్వేచ్ఛకు చట్టాలు, న్యాయస్థానలు, ప్రభుత్వాలు భరోసాగా ఉండాలన్నారు. భయపెట్టే ధోరణిలో ఉండకూడదన్నారు. తమిళనాడు మదురై కోర్టు మరణశిక్ష తీర్పు కన్నా ఒళ్ళు గగుర్పొడిచే ఘటనలు ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాలో జరిగాయని, ఒక కేసులో పోలీసు లాఠీ దెబ్బలకు మరణిస్తే ఆ రహస్యం బయటకు రాకుండా ఆ పరిధి న్యాయ స్థానానికి ముద్దాయి పరారీలో వున్నట్టు నేటికీ రికార్డుల్లో చూపిస్తూ ఆ కేసును కాలగర్భంలో కలిపేశారన్నారు. మరో కేసుగా ఒకే ఒంటిలో ఒకరిని హత్య గాను.. నలుగురిని కుట్రతో విష ప్రయోగంతోను మొత్తం 5 గురిని చంపేశారన్నారు. ఆ ఘటనల్లో ఫిర్యాదులు ఉన్నప్పటికీ అధికార దుర్వినియోగంతో కేసులను నీరుగార్చి నేటికీ ఆ కేసులు ఊసే లేకుండా వారి ఆధిపత్య అధికార దుర్వినియోగంతో నేరాల నుండి తప్పించుకుంటున్నారన్నారు. కస్టడీ లాకప్ మరణం కేసు లోను, ఒకే కుటుంబలో హత్యలు కాబడిన కేసుల్లోను పోలీసు ప్రమేయాలు కలిగి ఉండటం విశేషం అన్నారు. ఇప్పటికి కొంతమంది పోలీస్ లు రిటైర్మెంట్ కూడా తీసుకోవటం.. ఈ తరహా కేసుల్లో కొస మెరుపు. ఇంకా కొంతమంది విధుల్లో ఉండటం గమన్నార్హం అన్నారు. మాకు తెలిసిన సమాచారం మేరకు లాకప్ కేసుకు సంబంధించిన ఘటనలో అప్పటి ఇంటిలిజెన్స్ అధికారి ఉన్నత అధికారులకు ప్రత్యేక నివేదిక సమర్పించినా అప్పటి అధికారిక ఆమాత్యుడు, ఒక ఉన్నత అధికారి ప్రమేయంతో కేసును నీరు గర్చారని భోగట్టా అన్నారు. అధికార దుర్వినియోగ విధులతో హత్యచేసి న్యాయ స్థానాన్ని సైతం నేటికీ మోసం చేస్తున్నారంటే మన రాజ్యాంగం బలహీనంగా వుందా.. చట్టాలు బలహీనంగా ఉన్నాయా?.. మేము లేవనేత్తిన లాకప్ మరణం , ఒకే కుటుంబలో జరిగిన హత్యలు కోసం ప్రభుత్వం స్పందించి మాతో కూడిన కమిటీని నియమిస్తే మాకు తెలిసిన కొన్ని లిఖిత పూర్వక ఆధారాలతో, సామాజిక బాధ్యతతో, ఒక న్యాయవాదిగా , ప్రజా ప్రతినిధిగా ప్రభుత్వానికి సహకరించగలమని ఆర్పీసీ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ తెలియజేశారు. సభకు అర్పీసీ సీనియర్ నేత పెండ్యాల కామరాజు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆర్పీసీ నేతలు డీవీ రమణమూర్తి, ఎండీ హుస్సేన్ , సిమ్మా దుర్గారావు , దుద్దే త్రినాద్ , దోషి నిషాంత్ , దుద్దే సురేష్ , వర్ధనపు శరత్ కుమార్ , గుడ్ల సాయి దుర్గా ప్రసాద్ , బసా సోనియా, సుంకర వెంకట భాస్కర రంగారావు , కొల్లి సత్యనారాయణ , చల్లా సాంబశివరావు , సింహాద్రి తిలక్ , మేకల కిరణ్ కళ్యాణ్ కందివలస రమణ , అడపా శేషగిరి , ముప్పన రమేష్ , తదితరులు పాల్గొన్నారు.




## క్రీడల ద్వారా శారీరక దృఢత్వం

### రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభించిన ఎంపీ పురందేశ్వరి

**రాజమహేంద్రవరం (మనసులో మాట), ఏప్రిల్ 12:** క్రీడలు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, జట్టు భావనను పెంచుతాయని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య అవసరమే.. కానీ పిల్లల సంపూర్ణ అభివృద్ధికి క్రీడలు అత్యవసరం అన్నారు. టెక్నాలజీ ప్రభావంతో పిల్లలు బయట ప్రపంచానికి దూరమవుతున్నారని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రధాని నరేంద్ర మోదీ క్రీడల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రాజమండ్రికి క్రీడా వసతుల కోసం నిధులు అందించారని ఎంపీ పురందేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులకు ఎంపీ అభినందనలు తెలిపారు.

### కైకవోలు గ్రామంలో

## అక్రమ బాణాసంచా సీజ్



**పెదపూడి( మనసులో మాట) ఏప్రిల్ 12..** పెదపూడి మండలం కైకవోలు గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన బాణాసంచా ను అధికారులు ఆదివారం పట్టుకోవడం కలకలం రేకెత్తించింది. ఇనప కోళ్ల వీర వెంకట సత్యనారాయణ అనే రైతుకు చెందిన ఇంటిని గోపిశెట్టి మణికంఠ స్వామి అనే యువకుడు అద్దెకి తీసుకుని భారీగా బాణాసంచెను నిల్వ చేసినట్లు అధికారులు తెలిపారు. కాకినాడ ఆర్టీవో మల్లి బాబు, పెదపూడి రెవెన్యూ తహశీల్దార్ సీతాపతి రావు, రివిన్యూ ఇన్స్పెక్టర్ చిన్నతల్లి బాణా సంచల నిలవాలని పరిశీలించారు. పోలీసులు అగ్నిమాపక శాఖ అధికారులు కూడా రంగ ప్రవేశం చేశారు. సుమారు 5 లక్షల రూపాయలు విలువ కలిగిన 47 బాక్సులలో 23 రకాల మందు గుండు సామాగ్రి ఉన్నట్లుగా అధికారులు వివరించారు. బాణాసంచా నిల్వల ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వేట్లపాలెం లో ఇటీవల జరిగిన బాణాల సంచా పరిశ్రమ ప్రమాదంలో 28 మంది మృతి చెందగా కొందరు గాయాలకు గురయ్యారు. వేట్లపాలెం నుండి రహస్యంగా పెదపూడి మండలం భద్రపరుస్తున్నట్లుగా స్థానికులు వివరిస్తున్నారు.

### ఎస్సీ హోదా రద్దు చేస్తూ సుప్రీం కోర్టు తీర్పు ఇస్తే...

# బ్రాహ్మణులకు సంబంధం ఏమిటి?

- మొదటి తరం లో అస్పృశ్యత కు వ్యతిరేకం పోరాటాలు స్వామి వివేకానంద, ఈశ్వర్ చంద్ర విద్యసాగర్,దయానంద్ సరస్వతి,రాజా రామ్మోహన రాయ్, కందుకూరి వీరేశ లింగం పంతులు వంటి బ్రాహ్మణులు కాదా....
- సనాతన ఆచారాలు పాటిస్తే ఎవరైనా విద్య నేర్చుకోవచ్చు...
- బ్రాహ్మణులపై అనుచిత వ్యాఖ్యలు తగవు...
- మంద కృష్ణ మాదిగ  అసత్య ఆరోపణలపై బ్రాహ్మణ సంఘం  ఖండన...

**కపిలేశ్వరపురం (మనసులో మాట ) ఏప్రిల్ 12..** భారత దేశం లోని దళితులు విదేశీ క్రిస్టియన్ మతం తీసుకుంటే ఎస్సి హోదా కు అర్హులు ఆవరు .అ హోదా రద్దు అవుతుందని అని రాజ్యాంగం ప్రకారం సుప్రీం కోర్టు తీర్పు చెపితే ఎం.అర్..పి.ఎస్. నాయకులు మంద కృష్ణ మాదిగ ప్రెస్ మీట్ పెట్టి అందులో బ్రాహ్మణుల పై విమర్శలు చేశారు. ఇందులో బ్రాహ్మణులను విమర్శించే పని ఆయనకు ఏమి ఉందని కపిలేశ్వరపురం మండల బ్రాహ్మణ సంఘం ఒక ప్రకటన లో ప్రశ్నించారు. అయన చేసిన వ్యాఖ్యలు బ్రాహ్మణుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా ఉన్నాయన్నారు.

ఈ సందర్బంగా బ్రాహ్మణ సంఘం నాయకులు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ప్రశ్నించడానికా లేదా బ్రాహ్మణులను అనవసరం గా దుయ్యబట్టడానికా అని ప్రశ్నించారు.

కోర్టు తీర్పుకు ,బ్రాహ్మణులకు సంబంధం ఏమిటన్నారు

ప్రెస్ మీట్ లో బ్రాహ్మణులను విమర్శిస్తే మీకు,మిమ్మల్ని నమ్ముకున్న దళిత క్రైస్తవ సోదరులకు వచ్చే ప్రయోజనం ప్రశ్నించారు.

మంద కృష్ణ మీద బ్రాహ్మణులందరికీ మంచి గౌరవం ఉందనీ,..మీరు జీవితాన్ని మీ జాతికి అంకితం చేసుకున్న తీరు ఆదర్శనీయం.అందులో సందేహం ఏమీ లేదు.కానీ మీరు బ్రాహ్మణులపై చేసిన అనుచిత,అసత్య ఆరోపణలు, అసందర్భ వ్యాఖ్యలను ఆంధ్రప్రదేశ్ లో అన్ని బ్రాహ్మణ సంఘాలు ముక్త కంఠంతో ఖండిస్తున్నాయన్నారు.

క్రైస్తవ మతం లోకి మారిన దళితులు వారియొక్క ఎస్సి హోదాను కోల్పోతారనేది భారత రాజ్యాంగ నిర్మాణం నిర్మాత డాక్టర్ బి అర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అనుసరించి ఇచ్చిన తీర్పుకు బ్రాహ్మణులకు సంబంధం ఏమిటని ప్రశ్నిస్తూ ఖచ్చితంగా దీనిపై మంద కృష్ణ సరియైన వివరణ ఇవ్వాలన్నారు.

భారత దేశంలో బ్రాహ్మణ ఆధిపత్యం గురించి మాట్లాడారు..స్వాతంత్ర్యానికి పూర్వం బ్రాహ్మణులు ఎక్కడైనా రాజ్య పాలన చేశారని ఎక్కడైనా ఉండడం మీరు చూసారా... పోనీ ఎక్కడైనా మీరు కనీసం విన్నారా అని ప్రశ్నించారు.స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగాన్ని బ్రాహ్మణులు రాశారా? కనీసం బ్రాహ్మణులు రిజర్వేషన్స్ పొందారా అనే విషయం చెప్పాలన్నారు .స్వతంత్ర భారతావనిలో బ్రాహ్మణుల ఆధిపత్యం మీకు ఎక్కడ కనబడింది??

బ్రాహ్మణేతర కులాలన్నీ బ్రాహ్మణుల బాధితులని అని మంద కృష్ణ సెలవిచ్చారు...అది వింటే తమకే నవ్వొచ్చింది..అలా ఆధిపత్యం చెలాయించాలంటే ప్రభుత్వం బ్రాహ్మణులదై ఉండాలి కదా అన్నారు.

కనీసం సంఖ్యా పరంగా చూసినా మేము అల్పులమే అయినా మీరన్నట్టు అందరిపై పెత్తనం చెలాయించడం బ్రాహ్మణులకు ఎలా వీలవుతుంది అని సంఘం సభ్యులు ప్రశ్నించారు.

భారత దేశంలో కుల వ్యవస్థ కు బ్రాహ్మణులే కారణం అన్నారు?కులవ్యవస్థ పై అంటరానితనం పై, అసమానత్వం పై పోరాడిన మొదటి తరం నాయకులలో ఎక్కువ మంది బ్రాహ్మణులని మర్చిపోయారా? రాజా రామ్మోహన్ రాయ్, స్వామి వివేకానంద, స్వామి దయానంద సరస్వతి,ఈశ్వర చంద్ర విద్యాసాగర్,ప్రతాప్ చంద్ర మజుందార్,కృష్ణస్వామి అయ్యర్, కందుకూరి.వీరేశలింగం పంతులు , ఇంకా ఎందరో అభ్యుదయ కవులు..వీరందరూ బ్రాహ్మణులు కారా??

భారత దేశంలో కులవ్యవస్థ రద్దు కు బ్రాహ్మణ జాతి అంతా కూడా కట్టుబడి ఉంది...ఈ కులవ్యవస్థ కు బ్రాహ్మణులంతా వ్యతిరేకులే..ఈ కుల వ్యవస్థనే కాదు దానిని ఆనుకుని ఉన్న రిజర్వేషన్ వ్యవస్థను కూడా రద్దు చేయవలసిందే...దీనిపై పోరాటానికి మేమంతా, మీతో నడవడానికి సిద్ధంగా ఉన్నాము...మీరు సిద్ధమా? అని మంద కృష్ణ మాదిగ ను ప్రశ్నించారు.

తర్వాత అర్చకులుగా బ్రాహ్మణులు మాత్రమే ఎందుకు ఉండాలి అని ప్రశ్నించారు..మన దేశంలో చాలా ఆలయాల్లో లో బ్రాహ్మణేతరులు అర్చకులుగా ఉన్నారనే విషయం మీరు గమనించుకోవాలి.

అర్చకులు ఫలానా కులం వారే ఉండాలి అనేది లేదు.ఎవరైతే ఆగమ శాస్త్రాలు నేర్చుకుని, నియమాలను పాటిస్తూ, నిష్టను అనుసరిస్తూ...అర్చక పరీక్షలలో ఉత్తీర్ణులౌతారో వారు అర్చక వృత్తిని స్వీకరించవచ్చు...అది వారి ఇష్టం..

బ్రాహ్మణులు దళితులను గుడిలోకి అనుమతి ఇవ్వలేదు అని ఆరోపించారు...అది పూర్తిగా నిజం కాదనీ అప్పుడైనా, ఇప్పుడైనా, ఎప్పుడైనా ఏ గుడి లోనైనా అర్చకుడు పరిమితమైన అధికారాలు కలిగిన వాడు మాత్రమేనన్నారు.

బాగా పూర్వం మాట విషయాలు వినడం తప్ప మనం చూడలేదు.స్వాతంత్ర్యానంతరం దళిత సోదరులు గమాలయాల్లోకి రావడం, దర్శనం చేసుకోవడం ఏ పూజారికైనా కడు ఆనందదాయకం.

దళితులకు చక్కటి అర్చక శిక్షణ ఇప్పించి, దళిత వాడ లలో మంచి హిందూ గుడులను నిర్మించి వారినే అర్చకులుగా నియమించండి..

అర్చకులు సంఘాన్ని శాసించే స్థాయిలో ఉన్నారన్నట్లు చెప్పారు..ఒక పని చేద్దాం మీకు నచ్చిన ఒక మూడు నగరాలు, ఒక మూడు మారుమూల పల్లెటూర్లు కు వెళ్దాం..అక్కడ ఉన్న పెద్ద అర్చకుల జీవన శైలిని ,పెద్ద పాస్టర్ శైలి వారి జీవనం ఒకసారి అంచనా వేసి మీడియా ముఖంగా చర్చించుకుందాం...ఇకపై నైనా సామాన్యశీ గా జీవిస్తున్న బ్రాహ్మణ సామాజిక వర్గం లేనిపోని విధంగా విమర్శలు చేయడం మంద కృష్ణ మాదిగ మానుకోవాలని హితవు పలికారు..ఈ సమావేశం లో మండల స్థాయి బ్రాహ్మణ సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు

## తణుకులో మంత్రి నిమ్మల పర్యటన అభివృద్ధి పనులకు శ్రీకారం

**తణుకు (మనసులో మాట) ఏప్రిల్ 12** :పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నియోజకవర్గంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పర్యటించారు. ఈ సందర్భంగా తణుకు మండలంలోని ముద్దాపురం, దువ్వ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు మరియు శంకుస్థాపన కార్యక్రమాల్లో మంత్రి పాల్గొన్నారు. రూ. 7.63 కోట్ల విలువైన పలు పనులకు ఆయన



శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. మంత్రి రాక సందర్భంగా తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఘన స్వాగతం పలుకగా, స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# క్రికెట బెట్టింగ్‌ల పై ఉక్కుపాదం

## క్రికెట్ బెట్టింగ్ లో పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తప్పవు ఎస్పీ రాహుల్ మీనా

**అమలాపురం( మనసులోమాట) ఏప్రిల్ 12..** ప్రస్తుతం ఐపీఎల్ క్రికెట్ జరుగుతున్న తరుణంలో అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలపై జిల్లా ఎస్పీ రాహుల్ మీనా హెచ్చరికలు జారీ చేసారు. ఎవరైనా క్రికెట్ బెట్టింగ్ కు పాల్ప డితే కఠిన చర్యలు తప్పవని ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

జిల్లా పరిధిలో ఇటీవల క్రికెట్ మ్యాచ్‌లు,ఐపిఎల్ ఆన్‌లైన్ గేమింగ్, సోషల్ మీడియా ఛానెల్స్, టెలిగ్రామ్ గ్రూపులు, వాట్సాప్ లింకులు, అనధికారిక యాప్‌ల ద్వారా అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలు విస్తృతంగా జరుగుతున్నట్లు పోలీసుల దృష్టికి వచ్చిందన్నారు. ముఖ్యంగా యువతను లక్ష్యంగా చేసుకుని భారీ లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ మోసపూరిత బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లు, టెలిగ్రామ్ ఛానెల్స్ నిర్వహిస్తున్న వ్యక్తులపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ డబ్బుతో జరిగే గ్యాంబ్లింగ్ కార్యకలాపాలు నిషేధించబడ్డాయనిఅటువంటి కసర్యకలాపాలకు పాల్పడి బంగారుభవిషత్ ను నాశనం చేసుకోవద్దని యువతను హెచ్చరించారు.

ఆంధ్రప్రదేశ్ గేమింగ్ చట్టం, 1974 సవరణల ప్రకారం డబ్బుతో బెట్టింగ్ ఆడటం, బెట్లు సేకరించడం, బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేయడం, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయడం, కమిషన్ తీసుకోవడం, లింకులు షేర్ చేయడం, బెట్టింగ్ కోసం బ్యాంక్ ఖాతాలు / ఖూ× ×ణలు ఇవ్వడం అన్నీ నేరాలుగా పరిగణించబడతాయన్నారు. ఇలాంటి కేసుల్లో ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ సెక్షన్లు 3, 4, 5తో పాటు అవసరమైతే దీఝా, ×ు ాాఘ్, సైబర్ క్రైమ్ చట్టాల కింద కూడా కేసులు నమోదు చేయబడతాయన్నారు.. ఇటీవల రాష్ట్రంలో టెలిగ్రామ్ ద్వారా క్రికెట్ బెట్టింగ్ యాప్‌లను ప్రచారం చేసిన పలువురిని పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటనలు నమోదయ్యా యియని ఎస్పీ స్పష్టం చేసారు.

అక్రమ బెట్టింగ్‌లో పాల్గొన్న లేదా నిర్వహించిన వారిపై జైలు శిక్ష భారీ జరిమానాలు మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, బ్యాంక్ ఖాతాలు, ఖూ× ఖాతాల సీజ్ చేయడం జరగుతుందన్నారు. నగదు స్వాధీనం సోషల్ మీడియా ఛానెల్స్ / టెలిగ్రామ్ గ్రూపుల బ్లాక్ సైబర్ మోసం, మనీ లాండరింగ్ కోణంలో విచారణ అవసరమైతే పీడి యాక్టు వంటి నిరోధక చర్యలు చట్టం ప్రకారం బెట్టింగ్ నిర్వహించే స్థలం, మొబైల్, రికార్డులు, నగదు, ఖాతా వివరాలు లభిస్తే అది నేరానికి ప్రత్యక్ష సాక్ష్యంగా పరిగణించబడుతుందన్నారు. తెలియని వ్యక్తులలకు డబ్బు పంపవద్దుత్వరగా డబ్బు వస్తుందని మోసపోవద్దు.. ఆర్థిక నష్టాలతో పాటు చట్టపరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని అటువంటివి ఎవరిదృష్టికి వచ్చినా వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయనిఎస్పీ తెలిపారు.

# భద్రాచలాన్ని ఆంధ్రలో కలిపి జిల్లా కేంద్రంగా ప్రకటించాలి

- ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపడం అంటే ఆదివాసీలకు అన్యాయమే
- రాష్ట్ర విభజన వలన నష్టపోయిన గిరిజనుల జీవితాలు బాగుండాలి అంటే పూర్వపు భద్రాచలం డివిజన్ ను ఆంధ్రాలో కలిపితేనే
- గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళన




**ఎటపాక( మనసులో మాట) ఏప్రిల్ 12:** రాష్ట్ర విభజనకు ముందు ఉన్న భద్రాచలం డివిజన్ ను ఆంధ్ర ప్రదేశ్ లో కలపి భద్రాచలం డివిజన్ ను జిల్లా కేంద్రంగా ప్రకటించాలి అని గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఎటుపాక మండలంలోని గౌరీదేవి పేట గ్రామంలో ఆదివాసి అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం నాయకుడు సొసైటీ డైరెక్టర్ పూసం రాష్ట్ర విభజన వల్ల మాకు ప్రధాన కేంద్రమైన భద్రాచలాన్ని విభజనకు ముందు ఉన్న భద్రాచలం డివిజన్ కేంద్రాన్ని ఆంధ్రలో కలిపి జిల్లా కేంద్రంగా భద్రాచలాన్ని ప్రకటిస్తేనే ఇక్కడ ఉన్న గిరిజనులకు గిరినేతరులకు మేలు జరుగుతుందని లేకుంటే తల లేని మొండెం లా ఉంటుంది ఎటపాక మండలం పరిస్థితి అని అన్నారు. వరదల సమయంలో గిరిజనులు తలదాచుకునే ఒకే ఒక్క ప్రాంతం భద్రాచల ప్రాంతమని కానీ విభజన పేరుతో పూర్తిగా అన్యాయం చేశారని ఇప్పుడు మరల ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపాలనే ఆలోచనతో తెలంగాణ నాయకులు విష్ ప్రయత్నాలు చేస్తున్నారని అది సరైనది పద్ధతి కాదని అన్నారు.



గిరిజనులకు మేలు జరగాలంటే నిజమైన మేలుకోరే వారి అయితే గోదావరి ఇవతల ఉన్న రాష్ట్ర విభజనకు ముందు భద్రాచలం డివిజన్ కేంద్రం ఎలా ఉందో అదేవిధంగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం పునర్ ఆలోచించి భద్రాచలం ఆంధ్రాలో కలిపి జిల్లా కేంద్రంగా చేయాలని ఆదివాసి గిరిజన సంఘాల అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

**ఐదు పంచాయతీలను తెలంగాణలో కలపడాన్ని అడ్డుకుంటాం..**

రాష్ట్ర విభజన తరువాత భద్రాచలం మండలాన్ని విడదీసి పట్టణ ప్రాంతాన్ని తెలంగాణలో రూరల్ ప్రాంతాన్ని ఆంధ్రాలో కలిపి ఎటపాక మండలం గా చేశారని ఇప్పుడు మరల అప్పాక మండలంలో కలపడం వలన పూర్తిగా నష్టపోయామని మళ్లీ 5 పంచాయతీలను విడదీసి ఇంకా తల లేని మొండం ల ఉంచి ఆదివాసీలకు జానడు భూమి కూడా లేకుండా పూర్తిగా అన్యాయం జరిగేలా కొందరు భద్రాచలానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు చూస్తున్నారు అని అలా జరిగే ప్రసక్తే లేదని ఐదు పంచాయతీలను పోనిచ్చేదే లేదని అన్నారు.. మీకు నిజమైన ఆదివాసీల పట్ల ప్రేమే ఉంటే భద్రాచలం డివిజన్ నీ ఆంధ్రాలో కలిపి జిల్లా కేంద్రంగా ప్రకటించాలని అన్నారు.

భద్రాచలం ప్రాంతం తెలంగాణలో ఉన్న కానీ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సీతారాముల భూభాగం మొత్తం ఆంధ్ర ప్రాంతంలోనే ఉంది కాబట్టి అలాగే భద్రాచలం ఆనుకొని ఉన్న ఎటపాక మండల ప్రజలు ఈ ప్రాంతం గిరిజనులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు పునర్ ఆలోచన చేసి పూర్వపు రాష్ట్ర విభజనకు ముందు ఎలా ఉందో అలాగే భద్రాచలం డివిజన్ ను ఆంధ్రాలో కలిపి జిల్లా కేంద్రంగా ప్రకటిస్తే పోలవరం నిర్వాసితులమైన మాకు నిజమైన న్యాయం అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఐదు పంచాయతీలను వదులుకునేదే లేదని తప్పకుండా భద్రాచలాన్ని ఆంధ్రలో కలిపి జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు నిరసనలు రాస్తారోకోలు చేపడతామని అలాగే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్తామని ఆదివాసీ గిరిజన సంఘం అఖిలపక్ష నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పూసం రాఘవయ్య, పిసా కమిటీ ఉపాధ్యక్షుడు సున్నం బుజ్జయ్య దొర, పిసా సెక్రెటరీ అపక రాంబాబు, తాటి శ్రీను, గౌరీ దేవి పేట మాజీ సర్పంచ్ ఉలవల శివ కనకరాజు, ఉప సర్పంచ్ మడకం నరసింహారావు పాల్గొన్నారు.

